ప్రజాశక్తి

బుధవారం 17 జులై 2024 8 పేజీలు



ప్రకాశం



బాపట్ల



మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

భూసేకరణ ప్రక్రియపై ప్రత్యేక దృష్టి

- ప్రజల అర్జీలు పరిష్కరించండి
- అధికారులకు కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

జిల్లాలో వివిధ జాతీయ రహదారులు, రైల్వే ప్రాజెక్ట్సుకు సంబంధించి భూసేకరణ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసేందుకు రెవెన్యూ అధికారులు ప్రత్యేక దష్టి సారించాలని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా, ఆదేశించారు. మంగళవారం తన ఛాంబర్ లో కలెక్టర్ తమీమ్ అన్సారియా, జెసి ఆర్.గోపాల్‌కృష్ణతో కలసి ఆర్డీవోలు, ఎస్‌డిసిలు, అటవీ శాఖ అధికారులు, ఐటిడిఏ, సర్వే అండ్ లాండ్ రికార్డ్స్ అధికారులతో సమావేశం నిర్వహించారు. జాతీయ రహదారులు, రైల్వే ప్రాజెక్ట్సుకు సంబంధించి భూసేకరణ ప్రక్రియ పురోగతి, 22 ఏ తొలగింపులు, సిసిఆర్‌సి కార్డ్స్ జారీ, మీకోసం అర్జీల పరిష్కారం, మీ సేవ, సచివాలయాల సేవలు, ఆర్‌ఒఎఫ్‌ఆర్ క్లెయిమ్స్ పెండింగ్, కోర్టు కేసులు వంటి అంశాలపై సమీక్షించి పలు సూచనలు, ఆదేశాలు ఇచ్చారు. కలెక్టర్ మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో ముటేషన్, రీ సర్వే, వెబ్‌లాండ్ లో పేరు నమోదు వంటి భూ సమస్యలపై ప్రజల నుండి వచ్చే అర్జీలపై రెవెన్యూ అధికారులు ప్రత్యేక దష్టి సారించాలన్నారు. పరిష్కరించదగిన సమస్యలను సత్వరం పరిష్కరించాలని, పరిష్కారం చేయలేనివి ఏ కారణంతో పరిష్కరించలేదో నిర్ధిష్టమైన కారణాలు సంబంధిత అర్జీదారులకు తెలియ చేయాలన్నారు. నిర్ధిష్టమైన కారణం లేకుండా ఏ ఒక్క దరఖాస్తును తిరస్కరించరాదని కలెక్టర్ స్పష్టం చేశారు. రెవెన్యూ అంశాలకు సంబంధించి ప్రజల వద్ద నుండి వచ్చే అర్జీలను మండల స్థాయిలో ఏ విధంగా పరిష్కరించబడుతున్నాయో ఆర్డీవోలు పూర్తి స్థాయిలో పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. ఎక్కడైతే భూ సేకరణ ప్రక్రియ పూర్తయిందో అక్కడ డ్రైవ్ మోడ్ లో మ్యుటేషన్ ప్రక్రియను చేపట్టాలని సూచించారు. 22 ఏ తొలగింపు ప్రక్రియలను నిర్ధేశించిన ▶ 3లో

అధికారం మారినా..

మాటల యుద్ధమే.!



- ఒంగోలులో మళ్లీ వేడెక్కిన రాజకీయం
- జనార్ధన్‌పై తీవ్ర ఆరోపణలు చేసి వెళ్లిన బాలినేని
- ఏం జరుగుతుందోనన్న ఆందోళనలో వైసిపి క్యాడర్
- అన్నీ తేలుస్తాననే దామచర్ల హెచ్చరికలపైనా కలవరం

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

ఒంగోలులో మళ్లీ రాజకీయం వేడెక్కింది. ఇద్దరు నేతల మధ్య మాటల యుద్ధం తీవ్రస్థాయిలో సాగుతోంది. అధికారం మారింది. స్వరాలు మాత్రం తగ్గలేదు. అటు మాజీ మంత్రి బాలినేని ఒంగోలు వచ్చీరాగానే ఎమ్మెల్యే దామచర్లపై తీవ్రస్థాయిలో ఆరోపణలు చేయగా.. వెంటనే దామచర్ల కూడా ఘాటుగా సమాధానం చెప్పారు. మళ్లీ బాలినేని మీడియా సమావేశం పెట్టి మరోసారి దామచర్లపై ఆరోపణలు చేశారు. దమ్ముంటే తనపై చేసిన ఆరోపణలు రుజువు చేయాలని హెచ్చరించి వెళ్లిపోయారు. ఇప్పుడు ఒంగోలులో ఏం జరుగుతుందోనన్న ఆందోళన వైసిపి క్యాడర్‌లో మొదలైంది. అందరి సంగతీ చూస్తామంటూ దామచర్ల చేసిన హెచ్చరికలూ అటు వైసిపి శ్రేణుల్లో కలవరం రేపుతున్నాయి. ఒంగోలులో భవిష్యత్ రాజకీయం ఎలా ఉంటుందోనన్న అంశంపై ఇప్పుడు రాజకీయవర్గాల్లో ఉత్కంఠ చర్చకు దారితీస్తోంది.

ఎన్నికలకు ముందు మాజీ మంత్రి బాలినేని.. ప్రస్తుత ఎమ్మెల్యే దామచర్ల... వీరిద్దరి మధ్య అనేక సార్లు మాటల యుద్ధం నడిచింది. తీవ్రస్థాయిలో ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకున్నారు. అభివృద్ధితో పాటు సంపాదనలు, అక్రమాలు, అవినీతి, పాలనలో తప్పిదాలపైనే ఆరోపణలు నడిచాయి. అప్పట్లో రాజకీయంగా ఇద్దరి మధ్య వార్ నడిచింది. ఎన్నికల వరకూ కొనసాగింది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చింది. ఒంగోలులో దామచర్ల ఎన్నడూ లేని రీతిలో భారీ మెజార్టీతో గెలిచారు. తర్వాత ఒకటీఅర తప్ప ఒంగోలులో పెద్దగా రాజకీయ కక్షసాధింపు చర్యలు కూడా ఏమీలేవు. ఫలితాల రోజున ఒంగోలు నుంచి వెళ్లిపోయిన బాలినేని సోమవారం నాడు వచ్చారు. రావటం రావడం మీడియా సమావేశంలో కూర్చుని ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌పై తీవ్రస్థాయిలో ఆరోపణలు సంధించారు. తనపై చేసిన ఆరోపణలను దమ్ముంటే రుజువు చేయాలని హెచ్చరించారు. తన వియ్యంకుడి విల్లాలపైకి వెళితే అంతుచూస్తామంటూ ఘాటుగానే స్పందించారు. దాడులతో పాటు భవ నిర్మాణాల యజమానులకు నోటీసులు ఇచ్చి డబ్బులు వసూళ్ల కోసం ప్రయత్నాలు చేస్తున్నా వంటూ దామచర్లపై ఆరోపణలు చేశారు. రాజుపాలెం వద్ద ప్రభుత్వ భూములను ఆక్రమించుకున్నా తానేనాడూ ఏమీ చేయలేదని చెప్పారు. ఒంగోలులోనే ▶ 3లో



మాట్లాడుతున్న ఎపి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఉమామహేశ్వరరావు

మున్సిపల్ కార్మికులను రెగ్యులర్ చేయాలి

▶ 3లో

సిఎం కార్యాలయ

చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్‌గా 'యశ్వంత్'

ఈయన మార్కాపురం వాసి

ప్రజాశక్తి-మార్కాపురం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి కార్యాలయ చీఫ్ సెక్యూరిటీ విభాగం అధికారిగా మార్కాపురం వాసి డిఎస్‌పి డాక్టర్ తంగిరాల యశ్వంత్ నియమితులయ్యారు. డాక్టర్ యశ్వంత్ మార్కాపురం వాసి కావడం విశేషం. డాక్టర్ యశ్వంత్ గతంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా పుత్తూరు, ఉమ్మడి అనంతపురం జిల్లా పుట్టపర్తి, తిరుపతి వెస్ట్, జమ్మలమడుగు సబ్ డివిజన్‌లలో డిఎస్‌పిగా పనిచేశారు. ఈయన డిఎస్‌పిగా పనిచేసిన పలు ప్రాంతాల్లో పోలీస్ అధికారిగా బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వర్తించారనే పేరుంది. పుత్తూరు డిఎస్‌పిగా పనిచేసిన సమయంలో ఎర్రచందనం స్మగ్లర్లను చాకచక్యంగా పట్టుకొని అరెస్టు చేశారు. రాష్ట్రంలోనే సమస్యాత్మకంగా పేరొందిన జమ్మలమడుగు సబ్ డివిజన్‌లో ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో శాంతి భద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా బాధ్యతలను నిర్వర్తించారు. దీంతో ఆయన పోలీసు ఉన్నతాధికారుల నుండి ప్రశంసలు కూడా పొందారు. ఈయన పనిచేసిన నాలుగు సబ్ డివిజన్‌ల పరిధిలో శాంతి భద్రతలను కాపాడుతూ... ప్రజల్లో, అధికారుల్లోనూ మంచి గుర్తింపు తెచ్చుకున్నారు.



యశ్వంత్ (ఫైల్)

డాక్టర్ టి.యశ్వంత్ మార్కాపురం పట్టణా వాసి. జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత తంగిరాల నాగ జగన్నాథ్-కె.శర్వాణి దంపతుల కుమారుడు. ఆయన మాతృమూర్తి శర్వాణి ప్రస్తుతం కంభం మండల విద్యాశాఖాధికారిగా పనిచేస్తున్నారు.

గ్రూప్-1లో ర్యాంకర్‌గా నిలిచి డిఎస్‌పిగా పనిచేస్తున్న యశ్వంత్ ముందుగా డాక్టర్ కోర్సు పూర్తి చేశాడు. గుండె వైద్య నిపుణులుగా రాణించారు. మంగళగిరిలోని ఎన్ఆర్ఐ హాస్పిటల్‌లో కొంతకాలం పనిచేశారు. వైద్యసేవల్లోనూ పేదల పట్ల జాలి చూపేవారు. ఆపదలో ఆదుకునే మనస్తత్వం యశ్వంత్ సొంతం. మాట సాయం కావచ్చు... ఆర్థికంగా కావచ్చు సాయం చేయడంలో ముందుండేవాడు. మంగళగిరి ఎన్ఆర్ఐలో పెద్దారవీడు గ్రామానికి చెందిన వాయిరి పార్వతమ్మ అనే వృద్ధురాలు ▶ 3లో

పాకల తీరానికి సోనా బోట్లు

- ఇక్కడ మత్స్యకారులకు తుపాన్ ఎఫెక్ట్
- కడలూరు బోట్లకు లేని షరతులు
- నష్టపోతున్న మత్స్యకారులు
- అధికారులు స్పందించాలని వేడుకోలు



సముద్రంలో తీరానికి బాగా దగ్గరగా వచ్చిన సోనా బోట్లు

ప్రజాశక్తి-శింగరాయకొండ

మండలంలోని పాకల సముద్ర తీరానికి తమిళనాడు రాష్ట్రంలోని కడలూరు నుంచి సోనా బోట్లు మంగళవారం నాడు భారీగా వచ్చాయి. మత్స్యశాఖ నిబంధనలు ఉల్లంఘించి సముద్రంలో మత్స్యసంపదను దోచుకుపోతున్నారు. ఇక్కడ మత్స్య సంపదను కాపాడాల్సిన అధికారులు కడలూరు సోనా బోట్ల దెబ్బకు హడలెత్తిపోతున్నారు. గత రెండు రోజుల నుంచి వర్షాలు కురవడంతో ఇక్కడ మత్స్యకారులు వేటకు అంతా పూర్తిస్థాయిలో పోలేక పోతున్నారు. అల్పపీడనం ప్రభావంతో స్వల్పంగా సముద్రంలో అలలు ఉండటంతో కూడా వేటకు అంతగా ఆసక్తి ఇక్కడ మత్స్యకారులు చూపడం లేదు. చెన్నై ప్రాంతంలో ఉన్న కడలూరు బోట్లు ఇక్కడ మత్స్య సంపదను దోచుకోపోవడమే టార్గెట్‌గా చేసుకొని విపరీతంగా బోట్లు రావటం జరిగిందని మత్స్యకారులు చెబుతు న్నారు. మంగళవారం నాడు ఉదయం నుంచి సాయంత్రం వరకు పాకల ఊళ్లపాలెం సముద్ర తీర ప్రాంతానికి 50కి పైగా కడ లూరు సోనా బోట్లు వచ్చి.. మత్స్య సంపదను దోచుకు పోతున్నాయని మత్స్యకారులు లబోదిబోకొట్టుకుంటున్నారు. గత వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో మత్స్యకారులు ప్రతిరోజూ ఇదే సమస్యను చెబు తూనే ఉన్నారు. అధికారులు ఎవరూ పట్టించు కోలేదని అప్పుడు వాపోయారు. ప్రస్తుతం ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 100 రోజులు పూర్తి కావడంతో మొదటిసారిగా మంగళవారం నాడు ఈ బోట్లు ఇక్కడ దర్శన మిచ్చాయి. ఈ ప్రభుత్వంలోనైనా తమకు న్యాయం జరుగుతుందని మత్స్యకారులు చెబుతున్నారు. ఒక్క రోజే 50 బోట్లు భారీ వలలతో వచ్చి మెరైన్ చట్టాన్ని ఉల్లంఘించి, ఒడ్డుకొచ్చి మరీ మత్స్య సంపదను దోచుకుపోతున్నాయి. సోనా బోట్ల సమస్యను పరిష్కరించాలని మత్స్యకారులు వేడుకుంటున్నారు.



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ వెంకట మురళి

ప్రాధాన్యత రంగాలకు బ్యాంకర్లు అధిక రుణాలివ్వాలి : కలెక్టర్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

ప్రాధాన్యత రంగాలకు బ్యాంకర్లు అధిక రుణాలు ఇవ్వాలని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి చెప్పారు. జిల్లాస్థాయి బ్యాంకర్ల సమీక్ష సమావేశం కలెక్టరేట్‌లో మంగళవారం నిర్వహించారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూపొందించిన వార్షిక ప్రణాళికను కలెక్టర్ ఆమోదించారు. వ్యవసాయానికి అధిక ప్రాధాన్యతనిచ్చి రుణ సదుపాయం కల్పించాలనికలెక్టర్ కోరారు. ప్రాధాన్యత, ప్రాధాన్యత లేని రంగాలకు కలిపి మొత్తంగా ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.13,443.60 కోట్లు రుణం ఇవ్వాలని రూపొందించిన ప్రణాళికను ఆమోదిస్తున్నట్లు కమిటీ చైర్మన్, కలెక్టర్ ప్రకటించారు. ప్రణాళికలో ప్రాధాన్యత రంగాలకు రూ.11,719 కోట్ల రుణాలు ఇవ్వాలన్నారు. ప్రాధాన్యత లేని రంగాలకు రూ.1,724 కోట్ల రుణాలు ఇవ్వాలని వివరించారు. తొలి ప్రాధాన్యతగా వ్యవసాయానికి రూ.10,053 కోట్ల రుణాలు ఇవ్వాలన్నారు. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల స్థాపనకు రూ.1,153.33 కోట్లు కేటాయించాలన్నారు. విద్యా రుణాలు, గహ నిర్మాణాలు, విద్యుద్ధీకరణ, సామాజిక అవసరాలు, తదితరమైన ప్రాధాన్యత రంగాలకు రూ.512 కోట్లు రుణాలు ఇవ్వాలన్నారు. బాపట్ల జిల్లా ఏర్పడినప్పటి నుంచి రూ.20,272కోట్ల రుణాలు అందించినట్లుకలెక్టర్ వెంకట మురళి తెలిపారు. అందులో వ్యవసాయరంగానికి రూ.12,792 కోట్లు, పరిశ్రమలకు రూ.1,611 కోట్లు, ఇతర ప్రాధాన్యత రంగాలకు రూ.921 కోట్లు, ప్రాధాన్యత లేని రంగాలకు రూ.4,947కోట్లు రుణాలుగా ఇచ్చినట్లు వివరించారు. యాంత్రిక పరిశ్రమల స్థాపనకు ప్రోత్సహించాలన్నారు. ఆర్.బి.ఐ నిబంధనల ప్రకారం గడిచిన ఆర్థిక సంవత్సరంలో రూ.10,743 కోట్లు రుణం ఇవ్వాలని లక్ష్యం కాగా రూ.12,792 కోట్ల రుణాలు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఎన్‌టిఆర్ భరోసా పింఛను పథకానికి అవసరమైన నగదు ముందుగానే సిద్ధం చేసి బ్యాంకు అధికారులను ఆదేశించారు. బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ మాట్లాడుతూ వ్యవసాయ రంగానికి బ్యాంకర్లు అధిక ప్రాధాన్యత నివ్వాలన్నారు. వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు బ్యాంకు అధికారులంతా సహకరించాలన్నారు. ఎస్సీ, ఎస్టీల సామాజిక అభివద్ధికి రుణ సదుపాయం కల్పించాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్సుబ్బారావు, లీడ్ బ్యాంకు కన్వీనర్ మాధురి, ఎల్‌డిఎం శివకష్ణ, నాబార్డు డిడిఎం రవికుమార్, ఆర్‌బిఐ నవీన్, వివిధ బ్యాంకుల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

శాఖాంబరి అలంకరణలో పోలేరమ్మ

ప్రజాశక్తి- టంగుటూరు

జరుగుమల్లి మండలం కామేపల్లి గ్రామంలోని శ్రీ పోలేరమ్మ తల్లి మంగళవారం శాఖాంబరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆషాడ మాసం సందర్భంగా పాడి, పంటలు సుభిక్షంగా ఉండాలని కోరుతూ అమ్మవారిని శాఖాంబరి రూపంలో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. చుట్టూ ప్రక్కల గ్రామాల ప్రజలు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యే పూజలు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ ఇఒ రావెళ్ళ శివ శంకర్, దేవస్థానం కమిటీ చైర్మన్ సూరంపల్లి కొండయ్య, ధర్మకర్తల మండలి సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

పొగాకు బేళ్ల అమ్మకం

ప్రజాశక్తి-టంగుటూరు

పొగాకు సూరలో అన్య పదార్థాలు, పేపర్లు లేకుండా వేలం కేంద్రానికి తీసుకొస్తే అధిక ధర పొందవచ్చునని వేలం నిర్వహణ అధికారి అట్లూరి శ్రీనివాసరావు తెలిపారు. చిరికూరపాడు, పంగులూరి వారిపాలెం, కమ్మవారిపాలెం, కట్టుబడివారిపాలెం గ్రామాలకు చెందిన రైతులు 485 సూర పొగాకు బేళ్లను మంగళవారం అమ్మకానికి తెచ్చారు. అందులో 466 బేళ్లు అమ్ముడు పోయాయి. వివిధ కారణాల చేత 19 బేళ్లను తిరస్కరించారు. కిలో పొగాకు సూర అత్యధిక ధర రూ.150, అత్యల్ప ధర రూ. 60, సరాసరి ధర రూ. 90-45 పైసలు పలికింది.

దొనకొండ విమానాశ్రయం పరిశీలన

కలెక్టర్ ఆదేశాల మేరకు పరిశీలించిన కనిగిరి ఆర్‌డిఓ జాన్ ఇర్విన్

ప్రజాశక్తి-దొనకొండ

జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా అదేశాల మేరకు కనిగిరి రెవెన్యూ డివిజనల్ అధికారి జాన్‌ఇర్విన్ మంగళవారం దొనకొండ విమానాశ్రయాన్ని, అందుకు సంబంధించిన భూములను క్షుణ్ణంగా పరిశీలించారు. ఇటీవల భోగాపురం విమానాశ్రయం పరిశీలనకు విచ్చేసిన సీఎం చంద్రబాబు, కేంద్ర విమానయాన శాఖ మంత్రి రాంమూర్తినాయుడులకు రాష్ట్రంలో ఉన్న విమానాశ్రయాల వివరాలు వెల్లడిస్తూ దొనకొండలో ఉన్న విమానాశ్రయం విషయం వివరించారు. ప్రభుత్వం నుంచి ఎప్పుడు ఎటువంటి ఆదేశాలు అందుతాయో అనే ఉద్దేశంతో జిల్లా కలెక్టర్ దొనకొండ విమానాశ్రయానికి చెందిన పూర్తి సమాచారం అందించాలని ఆర్డీవోను ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్డీవో విమానాశ్రయం భవనం, అందుకు సంబంధించిన 136 ఎకరాల భూమి వివరాలను పరిశీలించారు. విమానాశ్రయానికి చెందిన పూర్తి సమాచార నివేదికను కలెక్టర్‌కు అందిస్తామని ఆర్డీవో వివరించారు.



విమానాశ్రయం మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఆర్‌డిఒ జాన్ ఇర్విన్

ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ శ్రీనివాసరావు, వీఆర్వో పిచ్చిరెడ్డి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



అరుణ్‌కు అభినందనలు తెలుపుతున్న రవికుమార్

అరుణ్‌కు అభినందనలు

ప్రజాశక్తి-సంతనూతలపాడు

కడప జిల్లా పులివెందులలో జరుగుతున్న జూనియర్ బాలురు మరియు బాలికల 2వ సౌత్ జోన్ నేషనల్ ఛాంపియన్‌షిప్-2024లో భాగంగా మంగళవారం ఆంధ్రప్రదేశ్, తమిళనాడు జట్లు తలపడగా తమిళనాడు పురుషుల జట్టు ఆంధ్రప్రదేశ్ జట్టుపై 3 గోల్స్ వేసి విజయం సాధించారు. విజయం సాధించిన తమిళనాడు జట్టులోని అరుణ్‌కు ప్రకాశం జిల్లా హాకీ అసోసియేషన్ జాయింట్ సెక్రెటరీ తిరుమలశెట్టి రవికుమార్ అభినందనలు తెలిపి అవార్డు అందించారు.

సిఎం కార్యాలయ

చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్‌గా 'యశ్వంత్'

(మొదటిపేజీ తరువాయి)

డయాలసిస్ బాధితురాలు. ఆమెకు అత్యవసరంగా రక్తం అవసరమైంది. ఆమె చేతిలో డబ్బు లేదు. రక్తం అందించకపోతే ఆమె ప్రాణానికి ముప్పు ఏర్పడింది. అదే హాస్పటల్‌లో అప్పట్లో యశ్వంత్ డాక్టర్‌గా కొనసాగుతున్నారు. విషయం తెలుసుకున్న యశ్వంత్.. పార్వతమ్మకు రక్తదానం చేసి ప్రాణం నిలిపాడు. ఇలాంటి మంచి పనులు ఎన్నో చేసిన డాక్టర్ యశ్వంత్ సిఎం కార్యాలయ చీఫ్ సెక్యూరిటీ విభాగం అధికారిగా నియమితులు కావడం శుభపరిణామం.!

కలెక్టర్‌ను కలిసిన గొట్టిపాటి లక్ష్మి

ప్రజాశక్తి-దర్శి

దర్శి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి ప్రకాశం జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియాను మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. దర్శి నియోజక వర్గంలోని సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సారథ్యంలో కూట మి ప్రజా ప్రభుత్వం ప్రజల కోసం తీసుకుం టున్న విప్లవాత్మకమైన నిర్ణయాలు, పథకాలు ప్రజల దరిచేర్చే విధంగా అధికారుల నుంచి సంపూర్ణ సహకారం అందించాలని కోరారు. దర్శి నియోజకవర్గంలో కొందరు అధికారులు వైసీపీ ప్రభుత్వంలో పనులు చేయకుండా బిల్లుల కోసం తిరుగుతున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దర్శి అభివృద్ధి కోసం సంపూర్ణంగా సహకరించాలని ఆమె కలెక్టర్‌ను కోరారు. దర్శి పట్టణంతోపాటు నియోజకవర్గంలోని గ్రామాలకు అవసరమైన తాగునీరు అందించేందుకు సాగర్ జలాలను మళ్లించాలని కోరారు. నీటి ఎద్దడి అధికంగా ఉందని తెలిపారు. కలుషిత నీటితో ప్రజలు అనారోగ్యానికి గురయ్యే పరిస్థితులు ఉన్నాయని తెలిపారు. దర్శి పట్టణంలో మౌలిక సదుపాయాల కల్పన, పారిశుధ్యం మెరుగుదల వంటి వివిధ అంశాలపై చర్చించారు. ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్‌లో నియామకం, రేషన్ డీలర్ల నియామకం, ఖాళీగా ఉన్న రెవెన్యూ, మండల పరిషత్, ప్రభుత్వ వైద్యశాలల్లో పోస్టుల భర్తీ, విఆర్‌ఓల నియామకాలపై సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్‌కు అందజేశారు. దీనిపై కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్లు డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి వివరించారు.



కలెక్టర్ తమీమ్ అన్సారియాను కలిసిన టిడిపి దర్శి ఇన్‌ఛార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, లలిత్ సాగర్

భూసేకరణ ప్రక్రియపై ప్రత్యేక దృష్టి

(మొదటిపేజీ తరువాయి)

గడువు లోపు పరిష్కరించేలా చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో నిర్దేశించిన లక్ష్యం మేరకు సిసిఆర్‌సి కార్డ్సను జారీచేసేలా రెవెన్యూ అధికారులు ప్రత్యేక దష్టి సారించాలన్నారు. ఆర్‌ఓఎఫ్‌ఆర్ క్లెయిమ్స్ రీవెరిఫికేషన్ ప్రక్రియను రెవెన్యూ, అటవీ, ఐటిడిఏ అధికారులు సమన్వయంతో పనిచేసి త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కోర్టు కేసులపై సంబంధిత అధికారులు ప్రత్యేక దష్టి సారించాలని, పెండింగ్‌లో ఉన్న కోర్టు కేసులపై డివిజన్ స్థాయిలో సమావేశం ఏర్పాటు చేసుకొని కోర్టు ఉత్తర్వులను అమలు చేసేలా ఆర్డీవోలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. సమావేశంలో మార్కాపురం సబ్ కలెక్టర్ రాహుల్ మీనా, జిల్లా రెవెన్యూ అధికారి వి.విశ్వేశ్వరరావు, ఒంగోలు, కనిగిరి ఆర్డీవోలు జివి సుబ్బారెడ్డి, జాన్ ఇర్విన్, ఎస్‌డిసిలు ఝాన్సి లక్ష్మి, వరకుమార్, లోకేశ్వరరావు, డిఎఫ్ఓ శ్రీనివాసులు, డిటిడబ్ల్యుఓ జగన్నాథరావు, సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఏడీ కిశోర్‌బాబు, కలెక్టరేట్ భూసేకరణ విభాగం అధికారులు పాల్గొన్నారు.

హెల్మెట్ వాడకంతో నష్ట నివారణ: ఎస్ఐ

ప్రజాశక్తి-వెలిగండ్ల

మోటార్ సైకిల్ నడిపేవారు తప్పనిసరిగా తలకు హెల్మెట్ వినియోగించడం వలన ప్రాణనష్టం జరగకుండా కాపాడుకో వచ్చని వెలిగండ్ల ఎస్ఐ ఎం శివ అన్నారు. మంగళవారం వెలిగండ్లలో కనిగిరి మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జరిగిన మోటార్ సైకిల్ వాహనదారులు హెల్మెట్ ధరించడంపై అవగాహన కార్యక్రమంలో భాగంగా హెల్మెట్ ధరించండి ప్రాణాలు కాపాడుకోండి అంటూ అవగాహన కల్పించారు. రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు హెల్మెట్ లేకపోవడంతో మరణాలు ఎక్కువగా జరుగుతున్నాయని, మరణాలు తగ్గించేందుకు న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుళ్లు జి అచ్చిరెడ్డి, ఎస్ శ్రీనివాసులు, పారా లీగల్ వాలంటీర్లు జిఎస్ అండ్ జిడికె ఫౌండేషన్ చైర్మన్ గంధం శ్యామల్ గెర్షోమ్, గుడ్ హెల్ప్ ఫౌండేషన్ డైరెక్టర్ మంద్రు రమేష్ బాబు, న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.



హెల్మెట్ వాడకంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ శివ

ఆక్రమణల తొలగింపులో పక్షపాతం

నిబంధనలు పాటించని వైనం

ప్రజాశక్తి-కనిగిరి

కనిగిరి మున్సిపాలిటీ పరిధిలోని ప్రధాన వీధులలో ఫుట్‌పాత్‌పై ఉన్న ఆక్రమణల తొలగింపులో మున్సిపల్ శాఖ, సచివాలయాల అధికారులు పక్షపాత ధోరణి అవలంబిస్తుండడం పట్ల ప్రజల నుంచి వ్యతిరేకత వ్యక్తం అవుతోంది. ఇటీవల కనిగిరి పట్టణంలోని చెప్పుల బజారు, పామూరు బస్టాండ్, కందుకూరు రోడ్డు మార్గాలలో ఫుట్ పాత్‌పై ఉన్న చిరు వ్యాపారుల బంకులను, అక్రమ నిర్మాణాలను తొలగించే ప్రక్రియను మున్సిపల్ అధికారులు చేపట్టారు. కనిగిరి కందుకూరు మార్గంలో ఆర్టీసీ డిపో సమీపంలో ఆక్రమణల తొలగింపులో మున్సిపల్, సచివాలయ అధికారులు పక్షపాత ధోరణి అవలంబించారు. నిర్దిష్టమైన నిబంధన మేరకు ఆక్రమణల తొలగింపు చేపట్టకపోవడానికి ఆ ప్రాంతవాసులు వారిని నిలదీశారు. ఆక్రమణల తొలగింపునకు తాము అడ్డు కాదని స్వచ్ఛందంగా తొలగించేందుకు సహకరిస్తామని అధికారులకు తెలిపారు. అయితే అధికారులు పక్షపాత ధోరణితో కొన్ని ఆక్రమణలను తొలగించకుండా వదిలివేయడంతో నిలదీశారు. సైడ్ కాలువ మరియు ఫుట్ పాత్ వరకు తొలగింపులు చేపడుతున్నామని చెబుతూ తెలిసిన వారికి, సిఫారసులు ఉన్నవారికి ఒకరకంగా లేనివారికి మరొక రకంగా ఆక్రమణల తొలగింపు చేపట్టడం ఏమిటని అధికారులను ప్రశ్నించారు. మున్సిపల్ సచివాలయ అధికారులు ఒకరి మీద ఒకరు చెప్పుకుంటూ కాలం గడపడమే తప్ప నిర్దిష్టమైన నిబంధన మేరకు ఆక్రమణలు తొలగించకుండా పక్షపాత ధోరణితో వ్యవహరించడం వారి పనితీరుకు నిదర్శనంగా నిలుస్తోందని ఆ ప్రాంత వాసులు విమర్శిస్తున్నారు. ఉన్నతాధికారులు చొరవ చూపి సిఫార్సులు, తెలిసినవారు అనే వాటిని పక్కన పెట్టి సమాన దృష్టితో నిబంధన మేరకు ఆక్రమణలు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.



పక్కపక్కనే పక్షపాత ధోరణితో తొలగించని ఆక్రమణ

అధికారం మారినా..మాటల యుద్ధమే.!

(మొదటిపేజీ తరువాయి)

ఉంటానని, మీ అక్రమాలపై ప్రజాపోరాటం చేస్తామంటూ దామచర్లపై హెచ్చరికలు చేశారు. మీడియా సమావేశంలో పాల్గొన్న కార్యకర్తలు కూడా ఆయనకు మద్దతుగా నినాదాలు చేశారు. కేకలు వేశారు. బాలినేని వ్యాఖ్యలకు ఘాటుగానే సమాధానం చెప్పారు దామచర్ల కూడా. ఆయన కూడా సాయంత్రం మీడియా సమావేశం పెట్టి బాలినేని చేసిన ఆరోపణలకు సమాధానం ఇచ్చారు. తాము అధికారంలోకి వచ్చి నెలరోజులు కాకుండానే ఇష్టమొచ్చినట్లు మాట్లాడటం సరికాదన్నారు. మానసిక స్థితి సక్రమంగా లేకనే అలా మాట్లాడుతున్నావా? అని వ్యాఖ్యానించారు. ఒంగోలులో తండ్రీ కొడుకులు చేసిన అక్రమాల వల్లనే జనం బుద్ధి చెప్పారని.. ఓటమికి కారణాలు, తప్పిదాలపై మాట్లాడుకోకుండా రాగానే తమపై ఆరోపణలు చేయడం ఏమిటని ప్రశ్నించారు. నెల రోజులు కాకుండానే ఇలాంటి ఆరోపణలు చేయడం ఏమిటి? ఏం మాట్లాడుతున్నావంటూ బాలినేనిపై ధ్వజమెత్తారు. ఎన్నికల తర్వాత ఒంగోలులో ఏమీ గొడవలు లేవన్నారు. ఒంగోలు నుంచి పారిపోయావని తానెప్పుడూ అనలేదన్నారు. గతంలో తండ్రీకొడుకులు చేసినవి తాము మరిచిపోమంటూ హెచ్చరించారు. అందరి సంగతీ చూస్తామన్నారు. వియ్యంకుడి విల్లాలపై కమిటీ వేస్తామని చెప్పారు. ఇలా ఇద్దరి మధ్య ఆరోపణలు.. ప్రత్యారోపణలు వాడివేడిగా సాగాయి. ఈ పరిణామాలపై ఇప్పుడు వైసిపి క్యాడర్‌లోనే అలజడి మొదలైంది. ఎందుకంటే ఆరోపణలు చేసిన మాజీ మంత్రి బాలినేని తిరిగి హైదరాబాద్‌కు వెళ్లిపోయారు. రెండు నెలల తర్వాత వస్తామన్నారు. కార్యకర్తలకు అండగా ఉంటామన్నారు. అయితే బాలినేని ఇక్కడ లేనందున పార్టీలో ఇప్పటివరకూ ఆయన వెంట నడిచిన ముఖ్యుల పరిస్థితి ఏమిటన్నదీ ప్రశ్నార్థకంగా మారింది. మరో వైపు గంజాయిబ్యాచ్‌గా పేరొందిన చాలా మంది యువకులు నగరం విడిచి పారిపోయారని సమాచారం. బాలినేని చేసిన వ్యాఖ్యలు ఇటు వైసిపి నేతల్లోనూ కొంత ఊరట కలిగించినా మరోవైపు అంతర్లీనంగా ఆందోళనను కూడా పెంచాయి. ఆయన ఇక్కడ లేనప్పుడు పరిస్థితి ఏమిటన్న దానిపై తర్జనభర్జన పడుతున్నారు. గట్టిగా మాట్లాడితే కేసులు, వేధింపులు తప్పవనే భయంలోనూ ఉన్నారు. ఆర్థిక అంశాలూ కీలకంగా మారాయి. మాజీ మంత్రి బాలినేని వియ్యంకుడి విల్లాలపై కమిటీ వేస్తే జరిగే పరిణామాలు ఎలా ఉంటాయన్న దానిపైనా చర్చ నడుస్తోంది. బాలినేని ఆర్థికమూలాలపై ఏ స్థాయిలో దామచర్ల దృష్టి సారిస్తారనేదీ చూడాల్సి ఉంది. గట్టిగా ముందుకు వెళితే ఇద్దరి మధ్య వార్ మరింత పెరిగే అవకాశాలూ లేకపోలేదు. ఏదేమైనా ఒంగోలులో బాలినేని రాక..ఆయన చేసిన వ్యాఖ్యలు.. ప్రతిగా దామచర్ల రియాక్షన్‌తో రాజకీయ వాతావరణం వేడెక్కింది.



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ రంగారావు

వ్యాధులు ప్రబలకుండా చర్యలు

ప్రజాశక్తి-కనిగిరి

కనిగిరి పురపాలక సంఘం పరిధిలోని ప్రజలకు కాలానుగుణ వ్యాధులు డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని మునిసిపల్ కమిషనర్ టివి రంగారావు అన్నారు. మంగళవారం పురపాలక సంఘం కార్యాలయంలో సచివాలయ శానిటరీ సెక్రెటరీలు, మెప్మా సిబ్బంది, మేస్త్రీలకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పట్టణంలోని రోడ్లు, కాలువలను శుభ్రపరచి ప్రజలకు సీజనల్ వ్యాధులు రాకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. పట్టణంలోని ప్రజలకు మెప్మా సిబ్బంది సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించాలన్నారు. ఇండ్లలోని చెత్తను కాలువలో, ఖాళీ ప్రదేశాలలో వేయకుండా పారిశుధ్య కార్మికులు తమ ఇండ్ల వద్దకు వచ్చినప్పుడు వారికి చెత్తను అందించాలని తెలిపారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జ్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ చెన్నకేశవులు, మెప్మా సిఎంఎం రఘు తదితరులు పాల్గొన్నారు.

మురుగునీటి కాలువలు అభివృద్ధి చేయాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి గంగయ్య డిమాండ్

ప్రజాశక్తి - భట్టిప్రోలు

ఖరీఫ్ సీజన్ ప్రారంభమై రైతులు వ్యవసాయానికి సమాయత్తమవుతున్న తరుణంలో ప్రభుత్వం వ్యవసాయ మురుగు నీటి కాలువల మరమ్మత్తులు త్వరిత గతిన చేపట్టాలని సిపిఎం జిల్లా కార్యదర్శి సిహెచ్ గంగయ్య డిమాండ్ చేశారు. స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నూతన కూటమి ప్రభుత్వం మురుగు కాలువల అభివృద్ధికి నిధులు మంజూరు చేశమని చెప్పుకుంటున్నప్పటికీ పనులు ప్రారంభం కాలేదని ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లాలో అనేక మండలాల్లో ఈపాటికే మురుగు కాలువలు గుర్రపుడెక్కతో నిండిపోయి వర్షం పడితే నీరు బయటకు వెళ్లే మార్గం లేక నీరు పంట పొలాల్లోనే నిలిచిపోయి పంటలు నష్టపోయే ప్రమాదం



సమావేశంలో మాట్లాడుతున్న సిహెచ్. గంగయ్య

ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి ఏట అధిక వర్షాలకు మురుగు కాలువలు పారుదల లేక రైతుల పంటలు నీటమునిగి తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. ప్రభుత్వ రైతులు సాగు చేపట్టే వరకు పనులు చేపట్టకుండా సాగునీటి కాలువలు విడుదల చేసిన అనంతరం తాత్కాలికంగా గుర్రపు డెక్క మందులు చల్లి తొలగించాలని కోరారు. వ్యవసాయ రంగంలో 70 నుండి 80శాతం వరకు కౌలు రైతులే పంటలు సాగు చేస్తున్నారని అన్నారు. అలాంటి కౌలు రైతులకు విపత్తుల సమయంలో పంట నష్టపరిహారం, రాయితీలు పొందటానికి అవసరమైన కౌలు గుర్తింపు కార్డులు ప్రతి ఒక్కరికి ఇవ్వాలని కోరారు. ఈ కార్డులను భూమి యజమాని సంతకంతో సంబంధం లేకుండా గ్రామ సభలు నిర్వహించి కౌలుదారులను గుర్తించి కార్డులు ఇవ్వాలని కోరారు. కార్డులు పొందిన కౌలు రైతులకు బ్యాంకుల నుండి రుణాలు పొందే సౌకర్యం కల్పించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు టి కృష్ణమోహన్, నాయకులు ఎం సత్యనారాయణ, పి అహరోన్, డి సత్యనారాయణ, జి నాగరాజు, పి మనోజ్, భగవాన్దాస్, రైతు సంఘం కార్యదర్శి కె రామస్వామి పాల్గొన్నారు.



తాగునీటి చెరువును పరిశీలిస్తున్న నరేంద్ర వర్మ

ప్రతిరోజూ తాగునీరు ఇవ్వాలి

ప్రజాశక్తి - బాపట్ల

పట్టణ ప్రజలకు త్రాగునీటి కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని శాసన సభ్యులు వేగేశన నరేంద్ర వర్మ మున్సిపల్ అధికారులను ఆదేశించారు. పట్టణానికి త్రాగునీరు అందించే చెరువును అధికారులతో కలిసి ఆయన మంగళవారం పరిశీలించారు. ప్రస్తుతం పట్టణ ప్రజలకు రోజు మార్చి రోజు త్రాగునీరు అందిస్తున్న నేపథ్యంలో ప్రతిరోజు నీరు అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. సాగు నీటి కాలువలు ద్వారా విడుదలయ్యే నీటిని చెరువుకు నింపుకోవాలని అన్నారు. పెరుగుతున్న పట్టణ జనాభా అవసరాలకు అనుగుణంగా నీటి కొరత నివారించేందుకు రెండో చెరువు ఏర్పాటుకు సంబంధించి కార్యాచరణ రూపొందించాలని కోరారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ నిర్మల్ కుమార్, డి శ్రీనివాసులు పాల్గొన్నారు.



అన్నా క్యాంటీన్ భవనాన్ని పరిశీలిస్తున్న నరేంద్ర వర్మ

అన్నా క్యాంటీన్‌ను ప్రారంభానికి సిద్ధం చేయాలి

ప్రజాశక్తి - బాపట్ల

ఆగస్టు నెలలో అన్నా క్యాంటీన్ ప్రారంభానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు శాసన సభ్యులు వేగేనన నరేంద్ర వర్మ అన్నారు. పట్టణంలోని సూర్యలంక రోడ్డులో అన్న క్యాంటీన్ భవనాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. అన్న క్యాంటీన్ భవనానికి అవసరమైన మరమ్మతులు చేయాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. అన్ని హంగులతో తీర్చిదిద్దాలని సూచిచారు. అనంతరం పట్టణంలోని అనేక ప్రాంతాల్లో పర్యటించారు. ఆయా ప్రాంతాల్లో మురుగునీటి కాలువలను పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నిర్మల్ కుమార్, తెలుగుదేశం పట్టణ అధ్యక్షులు గొలపల శ్రీనివాసరావు, కావూరి శ్రీనివాసరెడ్డి, తెలుగుదేశం, జనసేన నాయకులు పాల్గొన్నారు.



కథా సంపుటి అవిస్కరిస్తున్న డాక్టర్ ప్రసాదరావు

'క్లాస్ రూం కథలు' కథా సంపుటి ఆవిష్కరణ

ప్రజాశక్తి - ఇంకొల్లు

స్థానిక జెడ్పి ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులైన డాక్టర్ కందేపి ప్రసాదరావు, డాక్టర్ కందేపి రాణి ప్రసాదు రచించిన 'క్లాస్ రూమ్ కథలు' అనే కథా సంపుటి పుస్తకాన్ని పాఠశాల హెచ్ఎం జి శ్రీనివాసరావు మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హెచ్ఎం శ్రీనివాసరావు మాట్లాడుతూ డాక్టర్ ప్రసాద్, రాణి ప్రసాద్ ఇరువురు తమ పాఠశాల పూర్వ విద్యార్థులని అన్నారు. బాల సాహితీవేత్త అయిన రాణి ప్రసాద్ బాలల ఇతివృత్తాంతాలను కదా వస్తువుగా తీసుకొని 60 పుస్తకాలు రచించినట్లు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం నుండి విశిష్ట మహిళా పురస్కారం, రూ.లక్ష నగదు బహుమతి ఆమె పొందారని తెలిపారు. కార్యక్రమంలో కె సునీల్‌తోపాటు పలువు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నెల రోజుల్లోనే అభివృద్ధి ప్రారంభం

ప్రజాశక్తి - చీరాల, వేటపాలెం

అధికారంలోకి వచ్చిన నెల రోజులకే నియోజక వర్గంలో అభివృద్ధి ప్రారంభమైందని ఎంఎల్ఎ కొండయ్య అన్నారు. మండలంలోని కొత్తపేట 216 జాతీయ రహ దారి నుండి లక్ష్మీ శ్రీనివాస కాలనీ వరకు నూతనంగా నిర్మించిన జీఎస్బీ రోడ్డు కల్వర్టు నిర్మాణాలను మంగళ వారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డారు. ఓడరేవు నుండి పట్టి సుబ్బయ్యపాలెం వరకు సింగిల్ రోడ్డును డబల్ రోడ్డుగా, బోయినవారి పాలెం నుండి కుంకలమర్రి వరకు రోడ్డు నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. కొత్తపేట పంచాయతీ సాధారణ నిధుల నుండి పనులు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఒ ఎంవిఎస్ శర్మ, పంచాయతీరాజ్ డిఇ ఎస్ శేషయ్య, పంచా



కల్వర్టు ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ కొండయ్య

యతీ సెక్రటరీ బడుగు రమేష్ బాబు, అక్కాయపాలెం సెక్రటరీ పరణం పూర్ణ కుమారి, మాజీ సర్పంచి జంగిలి వెంకట రామారావు, గవిని వెంకటరావు, తేలప్రోలు నాగేశ్వర రావు, కౌతవరపు జనార్ధనరావు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - చీరాల

వాతావరణ మార్పుల వలన నియోజకవర్గంలో సీజనల్ వ్యాధులు రాకుండా మునిసిపల్ అధికారులు, వార్డు సెక్రటరీలు ప్రత్యేక దృష్టి వహించి విధులు నిర్వహిం చాలని ఎంఎల్ఎ కొండయ్య అన్నారు. స్థానిక మునిసిపల్ కార్యాలయంలో ఆయన వార్డు సెక్రెటరీలతో మంగళ వారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన తొలి సరిగా మున్సిపల్ కార్యాల యంకు రావడం తో మున్సిపల్ కౌన్సిలర్లు, అధికారులు పుష్ప గుచ్ఛం అందించి కొండయ్యకు స్వాగతం పలికారు. ఈసందర్భం గా ఆయన మాట్లాడుతూ తాగునీరు కలుషితం కాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, గ్రామాల్లో శానిటైజేషన్ ఎప్పటికప్పుడు చేస్తూ ఉండాలని అన్నారు. కార్యక్రమంలో



కొండయ్యకు పుష్పగుచ్ఛం అందిస్తున్న కౌన్సిలర్‌లు

మునిసిపల్ కమిషనర్ చక్రవర్తి, కౌన్సిలర్లు సూరగాని లక్ష్మి, పొత్తూరి సుబ్బయ్య, చుక్క నాగలక్ష్మి, కౌన్సిలర్లు, వివిధ శాఖల అధికారులు, సెక్రటరీలు పాల్గొన్నారు.

హరిత విప్లవ సాధనలో అగ్రగామి వ్యవసాయ కళాశాల

ప్రజాశక్తి - బాపట్ల

అన్నదాతలకు వెన్నుదన్నుగా నిలిచి హరిత విప్లవ సాధనలో బాపట్ల వ్యవసాయ కళాశాల అగ్రగామిగా నిలి చిందని రాజమహేంద్రవరం ఐటీసీ లిమిటెడ్ సీనియర్ లీడ్ సైంటిస్ట్, బాపట్ల వ్యవసాయ కళాశాల పూర్వ విద్యార్థి డాక్టర్ బిఎస్ రామచంద్రారెడ్డి అన్నారు. వ్యవసాయ కళాశాల 79వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా జరిగిన సభకు రామచంద్రారెడ్డి హాజరయ్యారు. కళాశాల అసోసియేట్ డీన్ పి ప్రసూనరాణి ఆధ్వర్యంలో నిర్వహిం చిన సభలో ఆయన మాట్లాడారు. కర్షకుల సేవలో బాపట్ల వ్యవసాయ కళాశాల ఎన్నో అద్భుతాలను సృష్టించిందని అన్నారు. దేశంలోనే అత్యున్నతంగా పేరుగాంచిన బిపిటి వరి వంగడాన్ని 1983 సృష్టించిన ఘనత బాపట్లకే దక్కిందని అన్నారు. రిజిస్ట్రార్ గాజుల రామచంద్రరావు మాట్లాడుతూ దేశంలోనే అత్యున్నత వ్యవసాయ కళాశాలగా బాపట్ల వ్యవసాయ కళాశాల పేరు గడించిందని అన్నారు. 1945లో కేవలం ముగ్గురు విద్యార్థినులు మాత్రమే ఈ కళాశాల్లో చేరారని, ఇప్పుడు విద్యార్థుల కంటే విద్యార్థినులే ఎక్కువగా వ్యవసాయ విద్య అభ్యసించడానికి ఆసక్తి చూపు తున్నారని అన్నారు. 65శాతానికి పైగా విద్యార్థినులు వ్యవసాయ విద్య అభ్యసిస్తున్నారని అన్నారు. ఎన్నారై కోటా సీట్లలో



ఉత్తమ విద్యార్థులకు పతకాలు అందిస్తున్న అధికారులు

80శాతం విద్యార్థులు ఈ కాలేజీలోనే విద్య అభ్యసించడానికి ముందుకు వస్తున్నారని అన్నారు. ఉత్తమ సాంకేతిక ప్రచురణలు చేసిన విద్యార్థులైన బి రెడ్డిలక్ష్మి, ఎం బాలభారతి, ఎ కావ్యను పతకాలతో సత్కరిం చారు. వ్యవసాయ విద్యలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పి లక్ష్మిసాహితి, కె కావ్యకు బంగారు పతకాలు బహుకరిం చారు. సభలో ఎఎజిటిసిడి ఎగ్జిక్యూటివ్ మెంబర్ డాక్టర్ కె సుశీల, అసోసియేట్ ప్రొఫెసర్, ది ఆంధ్ర అగ్రికల్చరల్ జర్నల్ ఎడిటర్ లాల్ అహ్మద్, పూర్వ ప్రాచార్యులు గోపీచంద్, బాలినేని వెంకటేశ్వర్లు, శేషగిరిరావు, ఉల్చి శంకరరావు, పిఆర్‌కె ప్రసాద్, జి సుబ్బయ్య, రత్నకుమారి, పి హరిప్రసాద్, పూర్వ అడ్మినిస్ట్రేటివ్ అధికారులైన సిహెచ్ కోటేశ్వరరావు, ఐ కోటేశ్వరరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జడ్జి డి నాగవెంకటలక్ష్మి

హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి

ప్రజాశక్తి - అద్దంకి

న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు న్యాయవాదులు, న్యాయ వాద గుమస్తాలు, కోర్టు సిబ్బందికి ద్విచక్ర వాహనదారులు, హెల్మెట్ ధరించక పోవడం వలన జరిగే ప్రమాదాలపై న్యాయ విజ్ఞాన సదస్సు మంగళవారం నిర్వహించారు. గురువారం ఉదయం 9.15గంటలకు కోర్టు భవనాల సమదాయం నుండి ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడంపై అవగాహన ర్యాలీ జరుగుతుందని తెలిపారు. నూతన వాహన చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే కుటుంబాలు సురక్షితంగా ఉండటంతోపాటు అధిక పెనాల్టీలు తప్పించుకోవచ్చని చెప్పారు. బైకుపై హెల్మెట్, కారులో సీటు బెల్టు ప్రాధాన్యత గుర్తించాలని కోరారు. ప్రజలు, విద్యార్థులు ర్యాలీకి హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి డి నాగ వెంకటలక్ష్మి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి జె శ్రీసీత, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్ ప్రియదర్శిని పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న బార్ ప్రెసిడెంట్ జి రమేష్

చీరాల : ద్విచక్ర వాహదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, ప్రమాదాల నుండి కాపాడుకోవాలని పలువురు సూచించారు. ఉన్నత న్యాయస్థానాల ఆదేశాల మేరకు న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ముంతావారి సెంటర్లో న్యాయ విజ్ఞాన సదస్సు మంగళవారం నిర్వహించారు. ఈసందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షులు జి రమేష్ బాబు మాట్లాడారు. ద్విచక్ర వాహన చోదకులు హెల్మెట్ ధరించకపోతే శిక్షార్హులు అతారని హెచ్చరించారు. ప్రస్తుతం నూతన చట్టాలు భారీగా జరిమానాలు ఉంటున్నాయని చెప్పారు. బైక్ రేసులు, ట్రిపుల్ రైడింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్, మైనర్లు డ్రైవింగ్ చేయటం, సెల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయటం తదితర నేరాల నుంచి దూరంగా ఉండాలని తెలిపారు. చట్టానికి అనుగుణంగా ప్రవర్తిస్తూ క్రమశిక్షణతో మెలగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ మహిళా ప్రతినిధి జికె ఈశ్వరిరెడ్డి, న్యాయవాదులు సిహెచ్ రామారావు, సోషల్ వర్కర్ పిఎల్‌విఎస్‌డి మతీన్, ట్రాఫిక్ ఎఎస్ఐ సిహెచ్ శ్రీనివాసరావు, కానిస్టేబుల్ పి గోపయ్య పాల్గొన్నారు.



చెక్కులు అందజేస్తున్న అధికారులు

బాధితులకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

పెద్దపులి దాడిలో పశువులు చనిపోయిన యజమానులకు మంగళవారం అటవీ శాఖ కార్యాలయంలో ఆర్థిక సహాయం అందజేశారు. జంగాల హనుమంతుకు రూ.50 వేలు, ఒంటేరు రాగవ హనుమంతుకు రూ.60 వేలు, వెన్నం పెద్ద జడలయ్య, జంగాల రాజు, జంగా వెంకటేశ్వర్లు, జంగా పోలురాజులకు తలో రూ. 25 వేలు చొప్పున నష్ట పరిహారం చెక్కులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కొర్రపోలు ఎఫ్ఆర్వో ప్రసన్న జ్యోతి, ఎఫ్‌బీవో లానిషా, టిడిపి నాయకులు భట్టు సుధాకర్‌రెడ్డి, కొప్పుల సుబ్బారెడ్డి, వైచెర్లోపల్లి గ్రామస్తులు పాల్గొన్నారు.



మొర్రి పిచ్చయ్యను సన్మానిస్తున్న సంతోష్ యాదవ్

విద్యార్థులకు చేయూత అభినందనీయం

ప్రజాశక్తి - గిద్దలూరు

పేద విద్యార్థులకు తన సొంత నిధులతో చేయుతనందించడం అభినందనీయమని పద్మశ్రీ సంతోష్ యాదవ్ అన్నారు. ఎవరెస్టు శిఖరం రెండుసార్లు అధిరోహించిన ప్రపంచంలోనే ఏకైక మహిళ పద్మశ్రీ సంతోష్ యాదవ్ ఒంగోలు నగరంలో జై కృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రతిభ అవార్డుల కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మొర్రి పిచ్చయ్య ఉపాధ్యాయుడిగా విద్యార్థులకు మెళకువలతో విద్యను నేర్పడమేకాక, తన సంపాదనలో కొంత మేర పేద విద్యార్థుల కోసం వెచ్చించి స్టడీ మెటీరియల్స్ తదితరాలు అందించడం అభినందనీయం అన్నారు. అనంతరం మొర్రి పిచ్చయ్యను శాలువా మెమెంటోతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ద్రావిడ దేశం కష్ణరావు, డాక్టర్ పెరుగు మురళి కష్ణ, డాక్టర్ శ్రీకాంత్ మరియు జై కష్ణ బీసీ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



విచారణ చేస్తున్న అధికారులు

ప్రజా ఫిర్యాదులపై విచారణ

ప్రజాశక్తి- ఒంగోలు సబర్బన్

ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రతి సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించే మీ కోసం కార్యక్రమానికి నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు చేసిన ఫిర్యాదుల మీద కమిషనర్ ఎం.జస్వంతరావు మంగళవారం విచారణ చేపట్టారు. షోషా హాస్పటల్ రోడ్డులో వచ్చిన ఫిర్యాదు, గద్దలగుంట పాలెంలో స్థలం విషయంలో వచ్చిన ఫిర్యాదుల మీద టౌన్‌ప్లానింగ్ సిబ్బందితో కలిసి విచారణ చేశారు. ఇంకా పలు సమస్యలమీద విచారించారు. ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సంబంధిత విభాగం అధికారులను ఆదేశించారు. కమిషనర్ వెంట అసిస్టెంట్ సిటీ ప్లానర్ కె.వెంకటేశ్వర్లు, డీఈఈ పద్మజా, తదితరులు ఉన్నారు.

నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం

మండల సమావేశంలో ఎమ్మెల్యే అశోక్ రెడ్డి

ప్రజాశక్తి- రాచర్ల

గిద్దలూరు నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా రాజకీయాలు పక్కనపెట్టి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి ప్రజాప్రతినిధులకు పిలుపునిచ్చారు. రాచర్ల మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీడీవో విజయలక్ష్మి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల్లో వారి వారి పార్టీల గెలుపు కోసం కృషి చేస్తారని, ఎన్నికల అనంతరం ప్రజాప్రతినిధి ప్రజల కోసం, అభివృద్ధి కోసం పని చేయాలన్నారు. అనంతరం మండలంలో జరిగిన, జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై అధికారులు వివరణలు ఇచ్చారు. మండలంలో 25 చెరువులు ఉండగా, గత నాలుగు సంవత్సరాలుగా 21 చెరువులు పూర్తిగా డ్యామేజ్ అయినట్లు మరమ్మతుల కోసం ప్రతిపాదనలు పంపినప్పటికీ ఎలాంటి నిధులు రాలేదని నీటిపారుదల శాఖ అధికారులు వివరించారు. మండలంలో చెరువుల అభివృద్ధి, తాగునీరు, విద్యుత్ సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే అశోక్ రెడ్డి అధికారులకు సూచించారు. కార్యక్రమానికి ముందుగా రాచర్ల టౌన్ నుండి ప్రజలు మండల పరిషత్ కార్యాలయం వరకు ఊరేగింపుగా తీసుకొచ్చారు. వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు ఎమ్మెల్యేకు ఘనస్వాగతం పలికారు. పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి ఎస్కే ఖాసీంబీ, జడ్పీటీసీ పగడాల దేవి, అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అశోక్ రెడ్డి

న్యాయవాదులు విధుల బహిష్కరణ

ప్రజాశక్తి-మార్కాపురం

విజయవాడ బార్ అసోసియేషన్‌కు చెందిన న్యాయవాదులు పుప్పాల శ్రీనివాసరావు, పిల్లి సుధాకర్, వై.పూర్ణ మహేష్‌లపై జరిగిన అమానుష దాడికి నిరసనగా మార్కాపురం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు మంగళవారం విధులను బహిష్కరించి నిరసన తెలిపారు. బాధ్యులను శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మార్కాపురం బార్ అసోసియేషన్ అధ్యక్ష్య, కార్యదర్శులు భూపని కాశయ్య, యద్దనపూడి అనిల్‌కుమార్‌లు మాట్లాడారు. ప్రజాస్వామ్య వ్యవస్థకు మూలంగా వున్న నాలుగు స్తంభాల్లో ఒకటైన న్యాయ వ్యవస్థపై దాడి జరగడం అమానుషమని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ దాడి న్యాయవాదులందరినీ తీవ్ర ఆందోళనకు గురిచేసిందన్నారు. ఈ సంఘటనను ప్రజాస్వామ్యవాదులందరూ ముక్త కంఠంతో ఖండించాలని వారు కోరారు. దాడులు చేయడం ద్వారా న్యాయ వ్యవస్థను అదుపు చేయాలనుకోవడం మూర్ఖత్వానికి నిదర్శనమని అన్నారు. న్యాయవాదులపై దాడికి పాల్పడిన వారిని వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించడంతో పాటు భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావతం కాకుండా చర్యలు తీసుకోవాలని బార్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. ఈ కార్యక్రమంలో పట్టణ బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు ఉమ్మడి రవీంద్రనాథ్, మాజీ అధ్యక్షులు కె.శ్రీనివాస చౌదరి, షేక్ యూసఫ్ అలీ, సీనియర్ న్యాయవాదులు సయ్యద్ అలీ జహీర్, శివరాత్రి ప్రసాదరావు, ఇమ్మడిశెట్టి నాగేశ్వరరావు, కడియం రామయ్య, పి.బాలరంగారెడ్డి, వల్లభనేని కాశయ్య, ఆకుల ఉషశ్రీ, వై.వెంకటేశ్వరరెడ్డి, నారాయణరెడ్డి, బత్తుల రామిరెడ్డి, గుమ్మా వెలుగొండయ్య తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

మూగ జీవాలకు వైద్యం కరువు

రైతు సేవాకేంద్రాలకు నిలిచిన మందుల సరఫరా

ప్రజాశక్తి-యర్రగొండపాలెం



రైతు సేవా కేంద్రాల ద్వారా పశు పోషకులకు తమ గ్రామాల వద్దే పశువులకు వైద్యం అందించి ఆదుకుంటామని ప్రభుత్వాలు చెపుతున్నా ఆచరణకు మాత్రం నోచుకోలేదు. కిలో మీటర్ల దూరంలోని పశువుల ఆసుపత్రులకు వెళ్లే ప్రయాసం తప్పించి, గ్రామ స్థాయిలోనే గడ్డి విత్తనాలు మేలురకం దాణా సరఫరా చేసి అండగా నిలుస్తామని గత ప్రభుత్వం చెప్పింది. కానీ క్షేత్ర స్థాయిలో ఏడాదిగా రైతు సేవా కేంద్రాలకు మందుల సరఫరా చేయడంలో నిర్లక్ష్యం వహించింది. దీంతో ఎలాంటి సేవలు అందించలేని దుస్థితిలో పశువైద్య సహాయ సిబ్బంది ఉన్నారు.

ప్రకాశం జిల్లాలో గేదెలు ఆరు లక్షల 71 వేల 812 లక్షలు, ఆవులు 56 వేలు 332, గొర్రెలు 15 లక్షలు 67 వేల 122, మేకలు నాలుగు లక్షల 17 వేల 589, కోళ్లు ఎనిమిది లక్షల 33 వేల 434 మొత్తం 35 లక్షల 46 వేల 289. వీటికి గాను బహుళార్థ పశు వైద్యశాల ఒకటి, ప్రాంతీయ పశు వైద్యశాలలు 18, పశు వైద్య కేంద్రాలు 84, గ్రామీణ పశు వైద్యశాలలు 55, రైతు సేవా కేంద్రాలు 408 ఉన్నాయి. గతంలో వీటికి మండల, గ్రామీణ పశువైద్యశాలలతో పాటు గోపాలమిత్రల ద్వారా సేవలందించేవారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతు సేవా కేంద్రాలను ఏర్పాటు చేసింది. తొలినాళ్లలో మందులను సరఫరా చేశారు. వీటి వాడకం పూర్తయిన తరువాత ఇప్పటి వరకు తిరిగి సరఫరా చేయలేదు.

పాడి రైతులపై అదనపు భారం..

పశువుల్లో జ్వరాలు, పారటం, మేతమేయకపోవడం, నులి పురుగులు, గర్భాధారణ సమస్యలు తరచుగా వస్తుంటాయి. రైతు సేవా కేంద్రాల్లో మందుల సరఫరా లేకపోవడంతో పశుసంవర్ధక సహాయకులు రైతులకు బయట దుకాణాల్లో కొనుగోలు చేయాలని సూచిస్తున్నారు. వ్యాధిని బట్టి రూ.100 నుంచి రూ.1000 వరకు మందులు బయట కొనుగోలు చేస్తున్నారు. దాణా, గడ్డి ధరలు పెరగడంతో పాటు మందుల భారం అధికమైందని పోషకులు వాపోతున్నారు. ప్రైవేటుగా కొనుగోలు చేయలేని రైతులు మండల కేంద్రంలోని పశువుల ఆసుపత్రికి వెళుతున్నారు. దీని వల్ల సకాలంలో వైద్యం అందని పరిస్థితి.

మందులు బయట కొనుగోలు చేస్తున్నాం

మొదట్లో రైతు సేవా కేంద్రాలకు వెళితే మందులు ఇచ్చేవారు. గడిచిన సంవత్సర కాలంగా మందులు రావడం లేదని, బయట కొనుగోలు చేసుకోవాలని లేదా పశువుల ఆసుపత్రులకు వెళ్లి తెచ్చుకోవాలని చెబుతున్నారు. గత్యంతరం లేక బయట ప్రైవేటుగా కొనుగోలు చేసుకుంటున్నాం. ఈ ప్రభుత్వంలోనైనా పాడి రైతులకు అవసరమైన సేవలను అందించి ఆర్థిక భారాన్ని తగ్గించాలని కోరుతున్నాం.

పల్లెపోగు పిచ్చయ్య, రైతు, సర్వాయిపాలెం

19న మండల సమావేశం

ప్రజాశక్తి - మార్కాపురం రూరల్

ఈనెల 19వ తేదీన మార్కాపురం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బండి లక్ష్మీదేవి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో తోట చందన మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శుక్రవారం ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభం అవుతుందని ఈ కార్యక్రమానికి మండలంలో ఉన్న ప్రజా ప్రతినిధులు మరియు వివిధ గ్రామాల సర్పంచులు ఎంపీటీసీలు, ప్రజా ప్రతినిధులు హాజరు కావాలన్నారు. అన్ని శాఖల మండల అధికారులు తప్పనిసరిగా తమ పూర్తి నివేదికలతో మండల సర్వసభ్య సమావేశానికి హాజరు కావాలన్నారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి జరిగే ఈ సమావేశంలో గ్రామాల్లో ఉన్న సమస్యల పరిష్కారం గురించి వివిధ గ్రామాల ప్రజా ప్రతినిధులు అధికారుల దృష్టికి తీసుకెళ్లడం జరుగుతుందన్నారు.



తనిఖీలు నిర్వహిస్తున్న ఫారెస్టు అధికారులు

పాలంక తిరునాళ్లలో ప్లాస్టిక్ నిషేధం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

నల్లమల అటవీ పరిధిలోని పాలంకలో జరగనున్న తిరునాళ్లకు ప్లాస్టిక్ నిషేధించినట్లు దోర్నాల సబ్ డిఎఫ్‌వో వేణు తెలిపారు. మంగళవారం గంజివారిపల్లి పరిధిలోని అటవీ శాఖ చెక్‌పోస్టును ఆయన తనిఖీ చేశారు. భక్తులు తీసుకెళ్తున్న ప్లాస్టిక్ వస్తువులను, మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యపానం, ధూమపానం, వంట వండుట, రాత్రిళ్ళు బస చేయుట నిషేధించినట్లు తెలిపారు. కాలినడకన వెళ్లే యాత్రికులకు ప్రవేశం లేదన్నారు. బైక్‌లకు రూ.200, జీప్‌లకు రూ.800 పర్యావరణ రుసుము చెల్లిచాలన్నారు. ఈ కార్యక్రమంలో గంజివారిపల్లి ఎఫ్ఆర్వో సుబ్బారావు, సిబ్బంది పాల్గొన్నారు.



పాములపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

పాముల దినోత్సవం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో మంగళవారం అటవీ శాఖ అధ్వర్యంలో ప్రపంచ పాముల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా స్నేక్ రిస్క్యూవర్‌లు మల్లికార్జున, నిరంజన్‌లు మాట్లాడుతూ పాము కంగారులో భయపడి వాటిని రక్షించుకునే క్రమంలో కాటు వేస్తాయే తప్ప పగ పట్టవని తెలిపారు. పాములు పర్యావరణ పరిరక్షణలోను, పంటలను రక్షించడంలోనూ కీలక పాత్ర పోషిస్తాయన్నారు. సమస్త జీవ రాశులలోనూ ఇవి కూడా ఒక భాగమని, నిజానికి మానవ జాతికి పాములు చేసే హానికంటే మేలే ఎక్కువన్నారు. అనంతరం విద్యార్థులకు పాములను పట్టించి వారిలోని భయాన్ని పోగొట్టారు. పాములపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ఇంచార్జి రెహమాన్‌తో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

నిరుపయోగంగా చెత్త సంపద కేంద్రాలు

ప్రజాశక్తి-పిసి పల్లి

చెత్త నుంచి సంపద తయారు చేసే కేంద్రాలు నిరుపయోగంగా ఉన్నాయి. గతంలో టిడిపి ప్రభుత్వ కాలంలో వీటిని ఏర్పాటు చేశారు. ప్రతి పంచాయతీకి ఒక కేంద్రాన్ని మంజూరు చేసి, నిధులు కూడా విడుదల చేసింది. సుమారు ఎకరం స్థలంలో రేకుల షెడ్డు, సిమెంటు రాళ్లతో దాదాపు 20 తొట్లు కట్టి నిర్మాణం చేపట్టారు. వీటిని పర్యవేక్షించేందుకు పంచాయతీ వారి ఆధ్వర్యంలో ఒక ఉద్యోగిని కూడా నియమించారు. గ్రామాలలోని వీధులలో ఉన్న చెత్తను గ్రీన్ అంబాసిడర్ల ద్వారా సేకరించి ఇక్కడకు తీసుకువచ్చి వేస్తారు. వీటిని ఇక్కడ ఉపయోగించి చెత్త ద్వారా రకరకాల ఎరువు లాంటివి తయారు చేసేవిధంగా ప్రణాళిక సిద్ధం చేశారు. అప్పట్లోనే ఒక్కొక్క కేంద్రానికి రూ.10 లక్షలు ప్రభుత్వం మంజూరు చేసింది. వీటితో పాటు ఉపాధి హామీ పథకం ద్వారా మరి కొంత నిధులను కూడా మంజూరు చేసింది. తర్వాత కాలంలో వీటి గురించి పట్టించుకోలేదు. కేవలం వీధుల్లో ఉన్న చెత్తను మాత్రమే రోజువారీగా ఇక్కడికి తెచ్చి వేస్తారు. ఆ చెత్తను ఏవిధంగానూ శుద్ధి చేయడం లేదు. ఈ విధంగా గత ప్రభుత్వం కాలంలో, ఒక ప్రణాళికబద్ధంగా తయారు చేసిన కేంద్రాలు ప్రస్తుతం నిరుపయోగంగా ఉన్నాయి. కేంద్రాల వద్ద కాపలా కోసం ఉంచిన కాంట్రాక్ట్ ఉద్యోగులు కూడా



ఉపయోగంలో లేని ఓ చెత్త సంపద కేంద్రం

ఇక్కడ అందుబాటులో ఉండటం లేదు. పంచాయతీ వారి ఆధీనంలో ఉండటం వలన వారు రకరకాల పనుల కోసం వారిని ఉపయోగించుకుంటున్నారు. ప్రస్తుతం ఇక్కడ ఎలాంటి సంపద తయారు కావడం లేదు. దీంతో వీటిని ఏర్పాటు చేసిన ఉద్దేశం నెరవేరడం లేదు. ఇప్పటికీ పిచ్చి మొక్కల తోటి దర్శనమిస్తున్నాయి. టిడిపి ప్రభుత్వం అధికారంలోకి రావడం వల్ల వాటికి గత వైభవం ఏమైనా వస్తుందేమో చూడాలి.


అరుణాచలేశ్వర స్వామిని దర్శించిన 'దద్దాల'

అరుణాచలేశ్వరునికి 'దద్దాల' పూజలు

ప్రజాశక్తి-కనిగిరి

తమిళనాడులోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అరుణాచలేశ్వర ఆలయాన్ని కనిగిరి నియోజకవర్గం వైసీపీ ఇన్‌ఛార్జి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ సందర్శించారు. ఈ సందర్భంగా స్వామివారికి ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. వెనుకబడిన కనిగిరి ప్రాంతం అభివృద్ధి చెందాలని, ప్రజలకు మంచి జరగాలని పూజలు నిర్వహించినట్లు ఆయన తెలిపారు. దక్షిణ భారతదేశంలో పంచలింగ క్షేత్రాల్లో ఒకటైన అరుణాచలేశ్వరుడిని దర్శించి పూజలు చేయడం సంతోషాన్నిచ్చిందన్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ అర్చకులు ఆశీర్వచనాలు, తీర్థ ప్రసాదాలను అందజేశారు.


మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

'అర్ధవీడు'ను అభివృద్ధి చేస్తా: ఎమ్మెల్యే

ప్రజాశక్తి-అర్ధవీడు

అర్ధవీడు మండలానికి అధిక నిధులు వెచ్చించి అభివృద్ధి చేస్తానని గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక మండల అభివృద్ధి కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ మేడూరి వెంకట్రావు అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్‌రెడ్డి హాజరయ్యారు. ఆయన ప్రసంగిస్తూ అర్ధవీడు మండలం మారుమూల ప్రాంతమని, అధిక నిధులు వెచ్చించి అభివృద్ధి చేస్తానని అన్నారు. మౌలిక వసతులు, మంచినీరు, రోడ్డు రవాణా, వైద్యం తదితర విభాగాల్లో గత ప్రభుత్వంలో అభివృద్ధికి నోచుకోలేదని అన్నారు. అధిక నిధులు మంజూరు చేసి అర్ధవీడు మండలాన్ని అభివృద్ధి బాటన నడిపిస్తానని ఆయన తెలిపారు. ముత్తుములకు ప్రజలు పలు సమస్యలపై అర్జీలు సమర్పించుకున్నారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి చెన్ను విజయ, మండల నాయకులు, ఎంపిటిసిలు, సర్పంచులు, మండల తహశీల్దారు వెంకటేశ్వర్లు, ఇన్‌ఛార్జి ఎంపీడీవో సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.



కురిచేడులోని విలేజ్ హెల్త్ క్లినిక్ భవనం

మందుబాబులకు అడ్డాగా గ్రామ సచివాలయాలు

ప్రజాశక్తి-కురిచేడు

కురిచేడు గ్రామ పరిధిలోని సచివాలయం-2 మందు బాబులకు అడ్డాగా మారింది. కురిచేడు పంచాయతీకి రెండు సచివాలయ కేంద్రాలు మంజూరు కాగా రెండు కేంద్రాలకు సంబంధించిన సిబ్బంది ఒక కేంద్రంలోనే ఉండి విధులు నిర్వహిస్తున్నారు. రెండో కేంద్రం 19.12.2023న పూర్తి కాగా అప్పటి ఎంఎల్ఎ మద్దిశెట్టి వేణుగోపాల్ ప్రారంభించారు. రూ.40 లక్షలు వెచ్చించి స్థానిక ఎన్ఎస్‌పి కాలనీలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల వెనుకాల రైతు భరోసా కేంద్రం, విలేజ్ హెల్త్ క్లినిక్, గ్రామ సచివాలయం నిర్మించారు. ఈ నిర్మాణాలు అన్నీ పూర్తికాక మునుపే హడావిడిగా అప్పటి ఎంఎల్ఎ మద్దిశెట్టి వేణుగోపాల్ ప్రారంభించి ఆ మూడు భవనాలను అధికారులకు అప్పచెప్పారు. కానీ నేటి వరకు సచివాలయ సిబ్బంది ఆ కార్యాలయాలకు తాళాలు తీయకుండా సచివాలయం-1లోనే సచివాలయం-2 సిబ్బంది విధులు కొనసాగిస్తున్నారు. దానితో ఆ మూడు కార్యాలయాలు అసాంఘిక కార్యక్రమాలకు కేంద్రాలుగా మారాయి. ఎన్నిసార్లు అధికారులకు మొరపెట్టుకున్నా చేస్తాం, చూస్తాం అంటున్నారే తప్ప వాటిని ప్రారంభించి పనిచేసే విధంగా నేటికీ చర్యలు తీసుకోలేదు. ప్రజల డబ్బులు మూడు కార్యాలయాలకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం నిధులు వెచ్చించారు. గ్రామానికి దూరంగా కట్టడం వలన సిబ్బంది అక్కడకు పోయి పనిచేయడానికి ఉత్సాహం చూపించడం లేదు. ఇప్పటికైనా అధికారులు ఆ మూడు కార్యాలయాలకు సచివాలయ సిబ్బంది హాజరై ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకుంటారని ఆశిద్దాం.


విలేజ్ హెల్త్ క్లినిక్ వద్ద ఖాళీ మద్యం సీసాలు

రెండో రోజు కార్మికుల రిలే దీక్షలు

ప్రజాశక్తి-పొదిలి


పొదిలి డిపోలో రెండో రోజు రిలే దీక్షల్లో పాల్గొన్న కార్మికులు

పొదిలి డిపోలో యాజమాన్యం సాగిస్తున్న కార్మిక వ్యతిరేక చర్యలకు నిరసనగా రెండో రోజు మంగళవారం ఎంప్లాయీస్ యూనియన్ డిపో సెక్రటరీ పి ఓబులేసు ఆధ్వర్యంలో నిరాహార దీక్షలు కొనసాగాయి. ఈ సందర్భంగా దీక్షలకు కూర్చున్న కండెక్టర్ పిఎస్ రావుకు మహిళా కమిటీ నాయకురాలు చంద్రకళ, జి బ్రహ్మయ్యకు కే వెంకట్రావు దండ వేసి నిరాహార దీక్ష ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు మాట్లాడుతూ డిపోలో మూడు సంవత్సరాల నుంచి చార్టులు వేయకుండా అధికారులు కండక్టర్లను, డ్రైవర్లను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తూ అశాంతి వాతావరణాన్ని డిపోలో కలుగ జేస్తున్నారన్నారు. ఎక్సెస్ పేరుపై కనిగిరి డిపోకు రిలీజింగ్‌పై పంపిన డ్రైవర్లను వెంటనే మాతృ డిపోకు తెప్పించి లీవ్ పొజిషన్ కల్పించాలన్నారు. సకాలంలో ఉద్యోగులకు వార్షిక ఇంక్రిమెంట్లు కలిపేలా చర్యలు తీసుకోవాలని, డిస్పాచ్ మెకానిక్ కృష్ణ డ్రైవర్లపై అవలంబిస్తున్న పక్షపాత వైఖరిని విడనాడాలని, అతనిపై చర్యలు తీసుకొని వెంటనే డిస్పాచ్ మెకానిక్‌ను మార్చాలని అన్నారు. అహర్నిశలు శ్రమపడుతూ సంస్థకు ఆర్థిక వనరులు సమకూరుస్తున్న ఉద్యోగులను నిబంధనకు విరుద్ధంగా చిన్న చిన్న తప్పులకు ఆర్థిక నష్టం కలిగిస్తున్నారని, కానీ అక్రమ మస్టర్లు ఇచ్చి సంస్థకు ఆర్థికంగా నష్టం కల్పిస్తున్న ఎస్‌టిఐపై ఎటువంటి చర్యలూ లేకపోవడం దారుణమని అన్నారు. సమస్యలు పరిష్కరించేంత వరకు ఈ రిలే నిరాహార దీక్షలు కొనసాగుతాయని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్దసంఖ్యలో డ్రైవర్లు, కండక్టర్లు, కార్మికులు పాల్గొన్నారు.

విధుల పట్ల అలసత్వం వహిస్తే కఠిన చర్యలు

మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్

ప్రజాశక్తి-కనిగిరి

పేద ప్రజలకు నాణ్యమైన మెరుగైన వైద్య సేవలు అందించాలని కనిగిరి మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ అన్నారు. మంగళవారం కనిగిరి ఏరియా ప్రభుత్వ వైద్యశాలను మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ ఆకస్మికంగానూ తనిఖీ చేశారు. వైద్యశాలలోని వైద్యాధికారులు నిర్లక్ష్యం వీడి సమయపాలన పాటిస్తూ పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యశాలలో వైద్యం తీసుకుంటున్న రోగులకు వైద్యశాలలో నెల రోజుల నుంచి తమకు ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం పెట్టడం లేదని, రోగులు సమస్యను చైర్మన్ దృష్టికి తీసుకురాగా ఆయన కాంట్రాక్టర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. పేదలకు అందించాల్సిన ఆహారం అందించలేదనే విషయం కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహా రెడ్డి, ప్రకాశం జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్తానని ఆయన అన్నారు. వైద్యశాలలోని వైద్య అధికారులు ప్రభుత్వ వైద్యశాల మరియు


వైద్యాధికారులతో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ గఫార్

బాత్రూమ్స్ టాయిలెట్స్ అపరిశుభ్రంగా ఉండగా పరిశుభ్రం చేయకపోతే సహించేది లేదని ఆయన తెలిపారు. ప్రభుత్వ వైద్యశాలలో కంప్లైంట్ బాక్స్ ఎందుకు లేదని వైద్య అధికారులను ప్రశ్నించగా ఎటువంటి సమాధానం రాలేదు. ప్రభుత్వ వైద్యశాలలో విధులు నిర్వహిస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది, స్టాఫ్‌నర్స్ ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. లేదంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ వెంకటసుబ్బయ్య, స్టాఫ్ నర్స్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులకు 'కౌలు' గుర్తింపు కార్డులు: తహశీల్దారు

ప్రజాశక్తి-పొదిలి

మండలంలో అర్హత కలిగిన కౌలు రైతులను గుర్తించి వారికి గుర్తింపుకార్డులు ఇవ్వడం మన బాధ్యత అని తహశీల్దారు మహమ్మద్ జియా అన్నారు. మంగళవారం మండలంలోని కుంచేపల్లి, పాములపాడు పంచాయతీలలోని గ్రామాల రైతులకు మండల వ్యవసాయ అధికారి ఆధ్వర్యంలో అవగాహన సమావేశాలు జరిగాయి. ఈ సందర్భంగా తహశీల్దారు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ కౌలుదారు చట్టం-2019 ప్రకారం కౌలు కార్డుకు 11 నెలల కాల పరిమితి ఉంటుందని అన్నారు. కౌలు కార్డు జారీలో భూ యజమానికి, కౌలుదారునికి అగ్రిమెంట్ పైన గ్రామ రెవెన్యూ అధికారి సంతకం ఉంటుందని, సంతకం చేసే ముందు సదరు రెవెన్యూ అధికారి రికార్డులను కచ్చితంగా పరిశీలించాలని సూచించారు. కౌలుదారుడు దరఖాస్తు చేసిన మూడు రోజుల్లో కౌలు కార్డులు ఇవ్వాలని, ఒకే కుటుంబ సభ్యులకు ఇవ్వకూడదని, కార్డు పొందిన రైతుకు కేవలం వేసిన పంట మీద మాత్రమే అధికారం ఉంటుందని తెలిపారు. భూ యజమాని ఆ గ్రామంలో లేనట్లయితే వీడియో ద్వారా లేదా ఈమెయిల్ ద్వారా తన నిర్ణయాన్ని వెల్లడించవచ్చునని తెలిపారు. మండల వ్యవసాయ అధికారి ఎస్కే జైనులాబ్దిన్ మాట్లాడుతూ గ్రామ వ్యవసాయ


పొదిలిలో కౌలు రైతుల అవగాహన సమావేశంలో మాట్లాడుతున్న తహశీల్దారు

సహాయకులు విధిగా కౌలు రైతులను గుర్తించి వారికి గ్రామ రెవెన్యూ అధికారుల నుంచి కౌలు కార్డులు ఇప్పించాలని కోరారు. ప్రతి కౌలు రైతుకు అతని వేసిన పంటను నమోదు చేసి ప్రభుత్వం నుంచి వచ్చే పంట నష్టపరిహారం గాని, సబ్సిడీ విత్తనాలు గాని, పంటల బీమా అర్హత గాని, బ్యాంకు రుణాలు గాని కౌలు రైతులకు వచ్చేటట్లుగా చేయాలని సూచించారు. ఆయా కార్యక్రమాలలో గ్రామ రెవెన్యూ అధికారులు, గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

కనిగిరి: కనిగిరి మండలంలోని పోలవరం, బల్లిపల్లి గ్రామ పంచాయతీలలో మంగళవారం కౌలు రైతులకు పంట సాగు హక్కు పత్రాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ


రైతులకు సూచనలు అందజేస్తున్న ఏవో జోష్ణ దేవి

అవగాహన సదస్సుకు ముఖ్య అతిథులుగా మండల వ్యవసాయాధికారి పి జోష్ణదేవి హాజరై రైతులు పంట సాగు హక్కు పత్రం ముఖ్య ఉద్దేశం గురించి తెలియజేశారు. రైతులు పంట సాగు హక్కు పత్రాన్ని ప్రతి ఒక్కరూ తీసుకోవాలని, పంటలు దెబ్బతిన్న తరుణంలో, ప్రకృతి వైపరీత్యాల వలన దెబ్బతిన్న పంటలకు పంట నష్ట పరిహారం, ప్రధాన మంత్రి పసల్ బీమా యోజన పొందవచ్చని తెలిపారు. బీమాతో పాటు పండిన ధాన్యం అమ్ముకొనేందుకు ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బల్లిపల్లి గ్రామ వ్యవసాయ సహాయకులు బి వెంకట సుబ్బయ్య, వీఆర్వో ప్రసాద్, పోలవరం వ్యవసాయ సహాయకులు షేక్ షబానా తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
7
బుధవారం 17 జులై 2024



మాట్లాడుతున్న ఏవో శేషారెడ్డి

కౌలు రైతులకు అవగాహన

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

కౌలు రైతులకు యర్రగొండపాలెం-3 సచివాలయంలో మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ సోమ్లా నాయక్ మాట్లాడుతూ కౌలు పత్రాల ద్వారా కౌలు రైతులు బహుళ ప్రయోజనాలు పొందే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించిందని తెలిపారు. ప్రకృతి వైపరీత్యాలతో పంట నష్టం జరిగినప్పుడు కౌలు రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోలు, వీఏఏలు పాల్గొన్నారు.

పెద్దదోర్నాల: దోర్నాల మండలంలోని నల్లగుంట్ల, వై.చెర్లోపల్లి గ్రామాలలో మంగళవారం వ్యవసాయ, రెవెన్యూ శాఖల ఆధ్వర్యంలో సిసిఆర్సి కార్డులపై రైతులకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి జవహర్ లాల్ నాయక్ మాట్లాడుతూ వ్యవసాయ శాఖ ద్వారా పథకాలు లబ్ధి పొందాలంటే కౌలు రైతులు తప్పనిసరిగా వీఆర్వో వద్ద సిసిఆర్సి కార్డు పొందాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో ఆనందరావు, వీహెచ్ఏ మల్లునాయక్, షేద్రాక్ బాబు, రైతులు పాల్గొన్నారు.

త్రిపురాంతకం: త్రిపురాంతకం మండలంలోని సోమేపల్లి రైతు భరోసా కేంద్రంలో కౌలు కార్డు గురించి గ్రామ సభను నిర్వహించారు. ఈ సభలో మండల వ్యవసాయ అధికారి కె.నీరజ మాట్లాడుతూ పంట సాగు హక్కు చట్టం 2019 ప్రకారం కౌలు వేసుకునే ప్రతి రైతు సోదరులకు 11 నెలల కాల పరిమితితో కౌలు కార్డు (సిసిఆర్సి)ను ప్రభుత్వం మంజూరు చేస్తుందన్నారు. ఈ అవకాశాన్ని కౌలు రైతు తప్పనిసరిగా సరిగా వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి గుమ్మ అంకమ్మ, గ్రామ రెవెన్యూ అధికారి బి.దేవకరుణమ్మ, అగ్రికల్చర్ అసిస్టెంట్ గోపి క్రిష్ణ, రైతులు పాల్గొన్నారు.



నియామకపత్రం అందజేస్తున్న కమిటీ సభ్యులు

ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ వర్కర్స్ జిల్లా అధ్యక్షుడిగా ఖాదర్ వలీ

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ వర్కర్స్ జిల్లా అధ్యక్షుడిగా ఖాదర్ వలీ ఎన్నికయ్యారు. జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎస్కె అక్బర్ బాషా, మరో 10 మందితో కొత్త కమిటీ ఎన్నికైంది. ఆంధ్రప్రదేశ్ ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్కె రఫీ, రాష్ట్ర కార్యదర్శి షేక్ మీర్జాబాయి ఆదేశానుసారం ప్రకాశం జిల్లా ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ వర్కర్స్ కమిటీని రాష్ట్ర వర్కర్స్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎండి రఫీ అహ్మద్ కార్యాలయంలో ఒంగోలు నగరం, జిల్లావ్యాప్తంగా వచ్చిన 30 మంది ప్రముఖలతో కొత్త కమిటీని ఎన్నుకున్నారు. కొత్త కమిటీ సభ్యులందరిని ఎమ్డి రఫీ అహ్మద్ అభినందించారు. ఈ సందర్భంగా రఫీ అహ్మద్ మాట్లాడుతూ ముస్లిం సమాజాన్ని అండగా ఉండాలని వారికి ప్రభుత్వ పరంగా వచ్చే పథకాలు అందే విధంగా కార్యవర్గం పనిచేయాలని సూచించారు గత 9 సంవత్సరాల నుంచి ఈ ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గంలో వివిధ వివిధ పదవులతో ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ ఆంధ్ర ప్రదేశ్ కమిటీలో వివిధ సేవలు అందిస్తున్నానని తెలిపారు.

అంకితభావంతో విధులు నిర్వహించాలి

- ఎస్పి గరుడ్ సుమిత్ సునీల్

- జిల్లా ఎస్పికి ఆత్మీయ వీడ్కోలు



ఎస్పి గరుడ్ సుమిత్ సునీల్‌ని సన్మానిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ప్రతి ఒక్కరూ అంకిత భావం, నిబద్ధతతో మరింత ఉత్సాహంతో విధులు నిర్వహించాలని బదిలీపై వెళుతున్న ఎస్పి గరుడ్ సుమిత్ సునీల్ పేర్కొన్నారు. స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో బదిలీపై వెళుతున్న జిల్లా ఎస్పి గరుడ్ సుమిత్ సునీల్ ఆత్మీయ వీడ్కోలు సభను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రజలు, పోలీసు యంత్రాంగం అందించిన సహకారం మరువలేనన్నారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో పోలీస్ అధికారులు, సిబ్బంది సంపూర్ణ సహకారం అందించడంతో ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో పారదర్శకంగా నిర్వహించగలిగామన్నారు. హోంగార్డు స్థాయి నుంచి అదనపు ఎస్పి వరకు ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు .విధుల్లో ఎలాంటి సవాళ్లు ఎదురైనా వాటిని అధిగమించి ముందుకు సాగాలని, కొత్త చట్టాలపై పూర్తి అవగాహన పెంచుకొని ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తూ జిల్లా పోలీస్ శాఖ ప్రతిష్ట పెంచాలని ఆకాక్షించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పి (అడ్మిన్) కె. నాగేశ్వరరావు, అదనపు ఎస్పి (క్రైమ్)ఎస్ వి శ్రీధర్ రావు, ఏఆర్ అదనపు ఎస్పి అశోక్ బాబు, డిపిఒ ఏఒ సులోచన, డిఎస్పిలు కిషోర్ బాబు, రామరాజు, అశోక్ వర్ధన్, బాల సుందరం, పోలీస్ లీగల్ అడ్వయిజర్ వేణుగోపాల్, సిఐలు, ఎస్సైలు, జిల్లా పోలీస్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలి

జిల్లా కలెక్టర్ వెంకట మురళి



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ వెంకట మురళి

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

పరిశ్రమలలో ప్రమాదాలు, ప్రాణ నష్టం జరగకుండా అధికారులు ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి ఆదేశించారు. ఫ్యాక్టరీలలో ప్రమాదాల నివారణపై జిల్లా స్థాయి కమిటీ సమావేశం స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో మంగళవారం జరిగింది. బాపట్ల జిల్లాలోని ప్రధాన ఫ్యాక్టరీలను అధికారులు తనిఖీలు చేసి నివేదిక పంపాలని జిల్లా కలెక్టర్ చెప్పారు. ఇటీవల విజయవాడలోని అల్ట్రాటెక్ ఫ్యాక్టరీలో ప్రమాదం జరగడంతో ప్రమాదాలపై ప్రభుత్వం అప్రమత్తమైందన్నారు. ఫ్యాక్టరీల భద్రతపై తనిఖీ చేయాలని జీవో నెంబర్ 79ని విడుదల చేసిందన్నారు. ఆ మేరకు జిల్లాలో కాటన్, ఆక్వా, మిర్చి ప్రాసెసింగ్ చేసే తదితరమైన ఫ్యాక్టరీలలో అమోనియం వినియోగించే ఫ్యాక్టరీలు 19 ఉన్నట్లు గుర్తించామన్నారు. ప్రజలకు నష్టం జరగకుండా వాటిని తనిఖీలు చేసి భద్రతపై నివేదిక పంపాలన్నారు. ఏ ఫ్యాక్టరీలోనూ ప్రాణహాని జరగరాదని హెచ్చరించారు. ముందుగా ప్రమాదాలు పసిగట్టి నివారణకు తీసుకోవలసిన చర్యలపై యాజమాన్యానికి, సాంకేతిక నిపుణులకు అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వ జీవోను అనుసరించి జిల్లాలోని ఫ్యాక్టరీలన్నింటిని ప్రతి మూడు నెలలకు ఒకసారి తనిఖీలు చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ బి సుబ్బారావు, పరిశ్రమల శాఖ జిఎం వై కష్ణ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ జి రాఘవరెడ్డి, ఇన్స్పెక్టర్ ఆఫ్ చీఫ్ ఫ్యాక్టరీస్ డిప్యూటీ ఇన్స్పెక్టర్ పరమేశ్వరరావు, ఇన్స్పెక్టర్ ఆఫ్ బ్రాయిలర్ తనిఖీ అధికారి శ్రీనివాసులు, ఇన్స్పెక్టర్ ఆఫ్ ఎలక్ట్రికల్ డి ఈ గీత, కార్మిక శాఖ సహాయ కమిషనర్ వెంకట శివ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తర్లుపాడులో పారిశుద్ధ్యం అధ్వానం

కాలువల్లో ముందుకు కదలని మురుగు

గ్రామమంతా చెత్త కుప్పల దర్శనం

ప్రబలుతున్న వ్యాధులు, ఆందోళనలో ప్రజలు

ప్రజాశక్తి-తర్లుపాడు

తర్లుపాడులో పారిశుద్ధ్యం అధ్వానంగా తయారైంది. గ్రామంలో ఎక్కడ చూసినా చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. కాలువల్లో చెత్త పేరుకుపోయి దోమలకు ఆవాసాలుగా మారాయి. వర్షాకాలం కావడంతో ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారు. దోమల ఉధృతమై కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి.

నిరుపయోగంగా ఫాగింగ్ యంత్రాలు

వర్షాకాలం ప్రారంభంలోనే వ్యాధుల నియంత్రణకు అధికారులు చర్యలు చేపట్టాల్సి ఉంది. నిరంతరం ఫాగింగ్ చేయించాలి. ప్రజలను సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తం చేయాలి. కానీ ఎక్కడ ముందస్తు చర్యలు చేపట్టలేదు. ఫాగింగ్ అటకెక్కించేశారు. నివారణకు ప్రత్యేకంగా మంజూరు చేసిన నిధులు నొక్కేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం ఎంతో ఖర్చు చేసి అట్టహాసంగా పంపిణీ చేసిన ఫాగింగ్ యంత్రాలు వినియోగించకపోవడంతో తుప్పుపట్టాయి.

పారిశుద్ధ్య పనులు శూన్యం

మండల కేంద్రమైన తర్లుపాడు పంచాయతీలో దాదాపు 12,000 మంది ప్రజల నివసిస్తున్నారు. పారిశుధ్య నిర్వహణ పేరుతో లక్షలు ఖర్చు చేస్తున్నా ఎక్కడా చర్యలు చేపట్టిన దాఖలాలే లేవు. మొక్కుబడిగా వార్తాపత్రికల్లో కథనాలు వచ్చినప్పుడు తప్ప, పారిశుద్ధ్య నిర్వహణపై శ్రద్ధ చూపడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. గ్రామంలో 6 మంది పారిశుద్ధ్య కార్మికులు ఉన్నారు. వీరితో పారిశుధ్య పనులు చేయించాల్సి ఉన్నా అధికారులు, పాలకుల నిర్లక్ష్యంతో పనులు జరగడం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పారిశుధ్య నిర్వహణను సక్రమంగా నిర్వర్తించేలా, ఫాగింగ్ చేసి దోమలను నియంత్రించి ప్రజలను వ్యాధుల బారిన పడకుండా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



నివాస గృహాల పక్కనే పేరుకుపోయిన చెత్త

కౌన్సిల్ సమావేశం వాయిదా

ప్రజాశక్తి - ఒంగోలు సబర్బన్

ఈనెల 18న నగరపాలక సంస్థ కార్యాలయంలో జరగాల్సిన కౌన్సిల్ సాధారణ సమావేశం పరిపాలనా సౌలభ్యం దృష్ట్యా వాయిదా వేస్తున్నట్లు నగర మేయర్ గంగాడ సుజాత మంగళవారం ఓ ప్రకనటలో తెలిపారు. తదుపరి మీటింగ్ జరుగు తేదీ, వివరాలను తరువాత నోటీసు ద్వారా తెలియజేస్తామని పేర్కొన్నారు. ఈ విషయాన్ని కార్పొరేటర్లు, కో ఆప్షన్ మెంబర్లు, ఎక్స్అఫిషియో మెంబర్లు గుర్తించాలని కోరారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే చంద్రశేఖర్

మొక్కుబడిగా మండల సమావేశం

ప్రజాశక్తి-పుల్లలచెరువు

ఎన్నికల అనంతరం జరుగుతున్న మొదటి సర్వసభ్య సమావేశం మొక్కుబడిగా సాగింది. మంగళవారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఎంపిపి కందుల వెంకటయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ పాల్గొన్నారు. ఎమ్మెల్యే వచ్చిన అనంతరం నలుగురు టీడీపీ ఎంపీటీసీలు, మరో ఇద్దరు సర్పంచులను పోలీసులు సమావేశం నుండి గెంటివేశారు. ఈ సందర్భంగా పోలీసులకు, టీడీపీ నాయకుల మధ్య వాగ్వాదం జరిగింది. సమావేశం ప్రారంభమై అధికారులు వారి రికార్డులను చదివి వినిపిస్తున్న సమయంలో ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ కలగజేసుకొని గతంలో ఎలా పనిచేశారో అలాగే పని చేయాలని, అధికార పార్టీకి తొత్తులుగా వ్యవహరించవద్దన్నారు. టీడీపీ సభ్యులు మాట్లాడుతూ పోలీసులతో మమ్మలను సభ నుండి గెంటేయడం హేమమైన చర్యన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ వాగ్యా నాయక్, తహశీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీవో విలియమ్స్, పలు శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కిలారి పెద్దబ్బాయి

షెడ్ల నిర్మాణానికి రాయితీ ఇవ్వాలి

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

గొర్రెలు, మేకల షెడ్ల నిర్మాణానికి 90 శాతం రాయితీ ఇవ్వాలని ఏపీ గొర్రెలు మేకల పెంపకందారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి కిలారి పెద్దబ్బాయి, జిల్లా కార్యదర్శి తోట తిరుపతిరావు డిమాండ్ చేశారు. స్థానిక ఎల్‌బిజి భవన్‌లో మంగళవారం జరిగిన సమావేశంలో వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పశువుల షెడ్లు నిర్మాణానికి 90 శాతం రాయితీ ఇవ్వాలని, గొర్రెలు, మేకలు, కోళ్ళకి 70 శాతం రాయితీ ఇవ్వాలని నిర్ణయించి ఈనెల 1న పంచాయతీరాజ్ శాఖ ద్వారా మార్గదర్శకాలు విడుదల చేసిందన్నారు. ఇందులో పశువులకు ఎక్కువ రాయితీ, సన్న జీవాలకు తక్కువ రాయితీ ఇవ్వడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. అన్ని రకాల షెడ్లు ప్రభుత్వం చెప్పిన ప్రకారమే నిర్మించాలని, ఖర్చు కూడా పశువులకు ఎంత అవుతుందో వీటికి కూడా అంతే అవుతుందన్నారు. 2019లో టిడిపి ప్రభుత్వం హయాంలో గోకులం పేరుతో షెడ్లు నిర్మించారని, అప్పుడు అన్ని పశువులకు సన్న జీవాలకు ఒకేలా 90 శాతం రాయితీ ఇచ్చారన్నారు. మంత్రి లోకేష్ ప్రజా గళం మేనిఫెస్టోలో హామీ ఇచ్చారని గుర్తు చేశారు.

మున్సిపల్ కార్మికులను రెగ్యులర్ చేయాలి

- ఎపి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఉమామహేశ్వరరావు
- ఉత్సాహభరిత వాతావరణంలో మున్సిపల్ వర్కర్ల నగర మహాసభ

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మున్సిపల్ కార్మికులను రెగ్యులర్ చేయాలని ఎపి మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్(సిఐటియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ఉమామహేశ్వరరావు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. మున్సిపల్ వర్కర్స్ నగర ఆరో మహాసభ మంగళవారం స్థానిక కాపు కళ్యాణ మండపంలో కె.గోపి, కె.సామ్రాజ్యం, పి.కోటేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. ఉత్సాహ భరిత వాతావరణంలో జరిగిన ఈ మహాసభలో కార్మికులు పాల్గొని వారి సమస్యల మీద చర్చించి, భవిష్యత్తు కర్తవ్యాలను నిర్దేశించారు. సభలో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు పాల్గొని మాట్లాడారు. దశాబ్దాల తరబడి మున్సిపాలిటీలను నమ్ముకొని పనిచేస్తున్న కార్మికులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్, ఆప్కాస్ విభాగాలలో వేలాది మంది కార్మికులు అతి తక్కువ వేతనాలకు పనిచేస్తూ, కుటుంబాలను పోషించుకుంటున్నారని తెలిపారు. వారికి సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని కోరారు. కార్మికుల సమస్యల పరిష్కారంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చిన్నచూపు చూస్తున్నాయని తెలిపారు. తెలుగుదేశం పార్టీ మద్దతులో కేంద్రంలో మోడీ సర్కార్ కొలువు దీరిందని, బిజెపి, టిడిపి ప్రభుత్వాలు కార్మికుల సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని కోరారు. బిజెపి ప్రభుత్వం తెచ్చిన లేబర్ కోడ్‌లను రద్దుచేసి, కార్మిక చట్టాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణను ఆపాలని కోరారు. గతంలో మున్సిపల్ కార్మికుల సమ్మె సందర్భంగా ప్రభుత్వాలు ఇచ్చిన హామీలను అమలుచేయాలని కోరారు. కార్మికులు వారి సమస్యలు పరిష్కారం కోసం, హక్కుల సాధన కోసం ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు కాలం సుబ్బారావు, కార్యదర్శి గంటెనపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం మున్సిపల్ కార్మికులు ఉద్యోగులు, రైతులతో కలిసి ఐక్య పోరాటాల్లోకి రావాలని పిలుపునిచ్చారు. సిఐటియు నగర కార్యదర్శి టి మహేష్ మాట్లాడుతూ నగరపాలక సంస్థలో పెండిగ్‌లో ఉన్న కార్మికుల సమస్యల పరిష్కారానికి అధికారులు, ప్రజా ప్రతినిధులు చర్యలు చేపట్టాలని కోరారు. సభలో యూనియన్ నగర కార్యదర్శి యు రత్నకుమారి కార్యదర్శి నివేదిక ప్రవేశపెట్టారు. సభలో మున్సిపల్ వర్కర్స్ జిల్లా అధ్యక్షులు కొర్నెపాటి శ్రీనివాసరావు, సిఐటియు ఒంగోలు నగర ఉపాధ్యక్షులు దామా శ్రీనివాసరావు, తంబి శ్రీనివాసులు, జి రమేష్, ఎస్‌డి హుస్సేన్, సిఐటియు జిల్లా నాయకులు బంకా సుబ్బారావు, యూనియన్ నాయకులు టి విజయ, డి సుబ్బారావు, ఎం బాబు, ఏ రవి, రాములు,సిహెచ్ అక్కేశ్వరరావు, కె వంశీ, బి దివ్య, భారతి, పద్మ, నరేంద్ర, పృథ్వీ, సముద్రాల వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బాలినేని శ్రీనివాసరెడ్డి

ఆరోపణలు రుజువు చేయకుండా

ఎదురుదాడి ఎందుకు.?

- ఎమ్మెల్యే దామచర్ల జనార్థన్‌కు మాజీ ఎమ్మెల్యే బాలినేని సూటి ప్రశ్న
- నీ లాగా బ్యాంకులకు డబ్బులు ఎగ్గొట్టలేదని పునరుద్ఘాటన

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

'నా మీద భూ అక్రమాలు, హవాలా ఆరోపణలు, అవినీతి ఆరోపణలు చేశారు. అవి రుజువు చేయమని అడిగా.. అవి రుజువు చేయకుండా ఎదురు దాడికి దిగడం ఏంటి?' అని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్థన్‌ను మాజీ ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి సూటిగా ప్రశ్నించారు. మంగళవారం తన నివాసంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. 'జనార్థన్ తన కొవ్వు కరగదీస్తా నంటున్నాడని, తనకు ఎలాంటి కొవ్వులేదని, అధికారం ఉందని ఏదంటే అది మాట్లాడటం సబబు కాదని పేర్కొన్నారు. ఆయన కొవ్వు కరగదీయకుండా చూసుకోవాలని హితవు పలికారు. 2019లో ఓటమి తరువాత జనా ర్థన్ రెండేళ్ల అస్సలు ప్రజలకు కనిపించారా.? అని ప్రశ్నించారు. తన గురించి మాట్లాడే అర్హత ఆయనకు లేదన్నారు. తాను ఎంతో హుందాగా మాట్లాడుతున్నానని, వారే రెచ్చ గొట్టే వ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శించారు. సుబ్బారావు గుప్తా చొక్కా విప్పుకొని నాకు సవాల్ చేస్తున్నాడు..అస్సలు పోలీసు వ్యవస్థ ఉందా...? అని ఆయన ప్రశ్నించారు. తమ వియ్యంకుడి విల్లాలో కేవలం 24 సెంట్ల ప్రభుత్వ భూమి ఉంది. దాన్ని వాళ్లు ఎప్పుడో పక్కన పెట్టారని వివరించారు. దానిమీద రకరకాల విచారణలు వేస్తామని బ్లాక్ మెయిల్ చేయడం ఎందుకని ప్రశ్నించారు. అధికారం మీ చేతుల్లో ఉందని చేతనైతే విచారణ విచారణ చేసుకోండని సవాల్ విసిరారు. రాజుపాలెంలో డికె భూములే లేవని జనార్థన్ చెబుతున్నారని, ఈ విషయం తాను రుజువు చేసేందుకు సిద్ధంగా ఉన్నానని బాలినేని చెప్పారు. 150 మంది బిల్డర్లు, రియల్ ఎస్టేట్ వ్యాపారులకు నోటీసులు పంపారని తాను చెబితే 95 మందికేనని వారు ఒప్పుకున్నారని, వారి వద్ద డబ్బులు డిమాండ్ చేయడం వాస్తవం కాదా..? అని ప్రశ్నించారు. ఆధారాలతో సహా అన్నీ తాను నిరూపిస్తానన్నారు. తెలుగుదేశం పార్టీ వాళ్లకు ఎందుకు నోటీసులు పంపడం లేదని నిలదీశారు. తన మీద, తన కుటుంబ సభ్యుల మీద కేసులు పెట్టాలని చూస్తున్నారని, కేసులకు తాను బయపడనని బాలినేని స్పష్టం చేశారు. ప్రజల కోసం జగన్‌కే ఎదురు మాట్లాడానని గుర్తుచేశారు. ఇంటా బయట అనేక ఇబ్బందులు వచ్చినా సహించిన వాడినని పేర్కొన్నారు. సొంతపార్టీ వాళ్ల ద్రోహం చేసినా సహించానన్నారు. తనకు ఎవరెవరు ద్రోహం చేశారో తనకు తెలసని, త్వరలోనే అన్నీ వివరాలు బట్టబయలు చేస్తానని చెప్పారు. తాను వందల కోట్లు సంపాదించానని జనార్థన్ చెబుతున్నాడని, అవి రుజువు చేయాలని డిమాండ్ చేశారు. జనార్థన్ లాగా బ్యాంకులకు తామేమీ డబ్బులు ఎగొట్టలేదన్నారు. తనమీద జనార్థన్ చేస్తున్న ఆరోపణల విషయంలో చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ విచారించుకోవాలని విజ్ఞప్తి చేశారు. నగరపాలక సంస్థ కార్పొరేటర్లు ఎవ్వరూ పార్టీ మారడం లేదని ఆయన పునరుద్ఘాటించారు. ఎవరైనా పార్టీ మారి వెళతామంటే వారికి తామేమి కాపలా కాదని, వారి విజ్ఞతకే వదిలేస్తామని బాలినేని స్పష్టం చేశారు. రెండేళ్ల పదవిని కాపాడుకునేందుకు రాజకీయ భవిష్యత్తును కార్పొరేటర్లు బలిచేసుకోవడం మంచి పద్ధతి కాదని ఆయన సూచించారు. విలేకర్ల సమావేశంలో పార్టీ నగర అధ్యక్షులు కటారి శంకర్, నగరపాలక సంస్థ డిప్యూటి మేయర్ వెలనాటి మాధవరావు, తదితరులు పాల్గొన్నారు.